ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప జిల్లా వార్తలు
5
ఆదివారం 3 నవంబరు 2024



కడప కేంద్రం ద్వారా జనరంజక ప్రసారాలు

కడప ఆకాశవాణి కేంద్రం ద్వారా జనరంజక ప్రజోపయోగ కార్యక్రమాలు ప్రసారంచేస్తున్నాం. శ్రోతలు మెచ్చేలా వినూత్న కార్యక్రమాలు తెచ్చాం. జిల్లాలోని కళాకారులు, కవులను ప్రోత్సహించేందుకు మంచి కార్యక్రమాలు చేపడుతున్నాం. కరెంట్ అఫైర్స్, మహిళభారతి, సూక్తిరత్నావళి, డాక్టర్ల సలహాలు ప్రసారం చేస్తున్నాం. కడప కేంద్రం ప్రసారాలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది.

- మహేశ్ తుండూరి, ప్రోగ్రాం డైరెక్టర్, కడప ఆకాశవాణి కేంద్రం

'ఆకాశవాణి.. కడప కేంద్రం నుంచి ప్రసారం..' అనే మాటలు ఆరు దశాబ్దాలకు పైగా జిల్లా ప్రజలకు చిరపరిచితం. కడపలో రేడియో (ఆకాశవాణి) కేంద్రం ఏర్పడి 61 సంవత్సరాలు అయింది ఉమ్మడి రాష్ట్రంలోనే కడప కేంద్రం రేడియో ప్రసారాల్లో తన మార్క్‌ను చాటుకుంది. కర్ణాటక ప్రసారాలు కూడా ఇక్కడి నుంచే ఉండేవి. ఇక్కడ నుంచి ప్రసారం చేసే కార్యక్రమాలు అటు కన్నడనాట, ఇటు తెలుగునాట విశేషమైన ప్రజాదరణ పొందాయి. సోషల్ మీడియా పెరిగింది. ప్రసార మాధ్యమాలు ఎక్కువయ్యాయి. అయినా రేడియోకు ఉండే ఆదరణ అలానే ఉంది. ఇప్పటికీ అభిరుచి లేఖలు పంపడం, రేడియోలో నచ్చిన పాటలకోసం ఫోన్లు చేయడం ఏమాత్రం తగ్గలేదు. ఆరుదశాబ్దాల కడప ఆకాశవాణి కేంద్రం గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



ఆరు దశాబ్దాల ఆకాశవాణి



- ప్రసారాల్లో తన మార్కు చాటుతున్న కడప రేడియో కేంద్రం
- ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు
- అన్నివర్గాల కోసం ప్రత్యేక కార్యక్రమాలు
- ఇప్పుడు ఎఫ్‌ఎంలో కూడా ప్రసారాలు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

Sunday Special

(కడప-ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాల క్రితం ప్రధానమైన ప్రసార మాధ్యమం రేడియోనే. అప్పట్లో రేడియో అంటే ఓ స్టేటస్. ఆ ఇంట్లో రేడియో ఉందని గొప్పగా చెప్పుకునే రోజులవి. దేశంలో ఏ మూలన ఏ ఘటన జరిగినా అప్పట్లో రేడియోలు, పత్రికలే ఆధారంగా తెలుసుకునేవారు. అంతేకాదు రైతుల కోసం పాడిపంటలు, మహిళల కోసం మహిళాభారతి, యువత కోసం సినిమా పాటలు, నాటికలు, రంగస్థల కళాకారుల కోసం నాటకాలు, సాహితీవేత్తల కోసం కథలు, కవితలు.. ఇంకా జాతీయ, ప్రాంతీయ వార్తలతో రేడియోలే ప్రసార సాధనాలు. వార్తలు, పాటలే కాకుండా ప్రజోపయోగ కార్యక్రమాలు ప్రసారం చేసేవారు. అవి జనరంజకంగా ఉండేవి. తరువాత టీవీ చానెల్స్ రాకతో కొద్దిరోజులు వాటి మనుగడ ప్రశ్నార్థకంగా అనిపించేది. ఆ తరువాత ఎఫ్‌ఎంలు పుట్టుకొచ్చాయి. కొన్నిచోట్ల రేడియో స్టేషన్లు మూతబడ్డాయి కూడా. అయితే ఎన్ని ప్రసార మాధ్యమాలు వచ్చినా.. రేడియోకున్న క్రేజ్ తగ్గడం లేదు. మొబైల్‌ఫోను రాకతో రేడియోలు వాడడం తగ్గిపోయింది. అయితే ఇప్పుడు సమాచార శాఖ కూడా టెక్నాలజీని ఒడిసి పట్టుకుంది. న్యూస్ ఆన్ ఎయిర్ యాప్ ద్వారా మొబైల్‌లోకి వచ్చేసింది. దీంతో మొబైల్‌లో రేడియో కార్యక్రమాలు వింటున్నారు. మళ్లీ రేడియో ప్రసారాలకు ఆదరణ పెరుగుతూ పూర్వవైభవం దిశగా వెళుతోంది.

61 ఏళ్ల కిందట మొదలు

కడప ప్రాంతీయ రేడియో కేంద్రాన్ని 1963 జూన్ 17న ప్రారంభించారు. అప్పట్లో 2 ఇంటు 10 కిలో వాట్ల ట్రాన్స్‌మీటర్ ప్రసారాలు మొదలయ్యాయి. అంటే సాయంత్రం 5 నుంచి రేడియో ప్రసారాలు ప్రారంభం అయ్యేవి. 1975 జూన్ 1న మూడు ట్రాన్స్‌మీటర్లు ప్రారంభమయ్యాయి. దీంతో ఉదయం నుంచి మూడుపూటలా రాత్రి వరకు ప్రసారాలు వచ్చేవి. 1983 అక్టోబరు 10న వంద కిలో ట్రాన్స్‌మీటర్‌ను ఏర్పాటు చేశారు. అంటే కడప, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు ఇక్కడ నుంచి ప్రసారాలు అందేవి. ఇది ప్రాంతీయ కేంద్రం. అప్పటికే విజయవాడ, విశాఖపట్టణం, హైదరాబాదులో రేడియో స్టేషన్లు ఉండేవి. పేరుకు కడప ప్రాంతీయ కేంద్రం అయినప్పటికీ.. అటు వైజాగ్ వరకు ఇటు మహబూబ్‌నగర్, తెలంగాణవరకు మరోవైపు కర్ణాటక వరకు ప్రసారాలు అందేవి. కన్నడనాట తెలుగోళ్లు చాలా మంది ఉన్నారు. వారందరూ అప్పుడు కడప ప్రసారాలు వినేవారు.



రేడియో స్టేషన్‌లో రికార్డ్ చేస్తున్న దృశ్యం



శ్రోతల ఉత్తరాలను చదువుతున్న అనౌన్సర్ రవికుమార్‌రెడ్డి



అన్నివర్గాల వారి కోసం..

కడప రేడియో కేంద్రం అన్నివర్గాలను ఆకట్టుకునేలా ప్రసారాలు ఉండేవి. ఎంతో మంది కళాకారులు, సంగీత విద్వాంసులు, జానపద కళాకారులు, సాహితీవేత్తలు ఇలా ఎన్నో ప్రసారాలు వచ్చేవి. రైతుల కోసం పాడిపంటల పేరిట వ్యవసాయంలో శాస్త్రవేత్తల సూచనలు సలహాలు, అప్పట్లో రైతులు మార్కెట్‌ధరలపై ఆధారపడే వారు. ఇక పంట పొలాల్లో వచ్చే తెగుళ్ల నివారణకు సూచనలు అందించేవారు. సంగీతం, జానపద, సాహిత్యం, బుర్రకథలు, శాస్త్రీయ సంగీతం, నాటికలు...

- తరువాయి 6లో..

గుంతల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

- మరమ్మతులకు రూ.15.96 కోట్లు మంజూరు
- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



రోడ్డు మరమ్మత్తు పనులను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రోడ్లకు మరమ్మతులు చేపట్టి గుంతల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. గుంతల రహిత రోడ్లలో భాగంగా శనివారం నగరంలోని వైజంక్షన్ నుంచి రాజంపేట మార్గంలోని జాతీయరహదారిలో సుబ్బిరెడ్డి కళాశాల వరకు ప్యాచ్ వర్క్ పనులను అధికారులతో కలసి ఇన్‌చార్జి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రహదారుల మరమ్మతులు, పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.290.40 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాకు రూ.15.96 కోట్లు మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గాల వారీగా వీటిని కేటాయించామన్నారు. కడప నియోజకవర్గంలో మూడు పనులకు రూ.14.70 లక్షలు, రాజంపేటలో మూడు పనులకు రూ.47.95 లక్షలు, కమలాపురంలో 15 పనులకు రూ.119.05 లక్షలు, బద్వేలులో 13 పనులకు రూ.60.26 లక్షలు, ప్రొద్దుటూరులో 12 పనులకు రూ.133.05 లక్షలు, జమ్మలమడుగులో 46 పనులకు రూ.1012.90 లక్షలు, పులివెందులలో 9 పనులకు రూ.70.20 లక్షలు.. మొత్తం 110 పనులకు గాను రూ.15.96 కోట్లు రోడ్ల మరమ్మతులకు వినియోగిస్తున్నామన్నారు. రాష్ట్ర రహదారుల పనులు 6 కాగా జిల్లా రహదారులు 86 కలపి మొత్తం 92 రహదారుల పనులకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. వచ్చే ఏడాది జనవరి 15 నాటికి జిల్లాలోని అన్ని రహదారులను గుంతల రహిత రోడ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో ఆయా రోడ్లకు సంబంధించిన పనులను పూర్తి చేస్తామన్నారు. రోడ్ల మరమ్మతులు పూర్తయిన వెంటనే సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ జి.చంద్రశేఖర్, ఈఈ నాగేశ్వరరెడ్డి, డీఈలు, ఏఈలు, స్థానికప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి అపార్ తప్పనిసరి : డీఈవో



మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి అపార్ నమోదు తప్పనిసరి అని డీఈవో యు.మీనాక్షి తెలిపారు. శనివారం కడప నగరం జయనగర్ కాలనీ జడ్పీ బాలికోన్నత పాఠ శాలలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రప్రభుత్వాల ఆదేశాల మేరకు విద్యార్థులకు అపార్ నమోదు చేయడం వల్ల విద్యార్థికి ధ్రువీకరణ నెంబరు వస్తుందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులకు అవసరమైన అన్ని విద్యావస్తువులకు ఇది అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గంగిరెడ్డి, డీఈవో కార్యాలయ ఐటీసెల్ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి,జ్వాలాపతి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో అధిక కేసులను రాజీ చేయాలి

- జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబర్ 14న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులను రాజీమార్గంలో పరిష్కారం అయ్యేలా ఉమ్మడి కడప జిల్లాలోని ఆయా కోర్టుల జడ్జిలు కృషిచేయాలని డీఎల్ఎస్ఏ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి ఆదేశించారు. జిల్లా కోర్టు ఆవరణలోని ప్రధాన జడ్జి చాంబర్‌లో సెకండ్ క్లాస్ కోర్టు న్యాయమూర్తులకు ముందస్తు లోక్ అదాలత్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి మాట్లాడుతూ రాజీమార్గంలో కక్షిదారుల కేసులను పరిష్కారం చేయడం వలన వ్యక్తిగత సంబంధాలు తెబ్బతినవన్నారు. కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అని కక్షిదారులకు తెలియజేయాలన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పెండ్లిమర్రి/కడప క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సీఐ, ఎస్ఐలకు సూచించారు. శనివారం ఆయన కడప తాలూకా, సైబర్ క్రైం సెల్, సెంట్రల్ క్రైం స్టేషన్, పెండ్లిమర్రి పోలీసుస్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేశారు. కడప తాలూకా పోలీసుస్టేషన్లలో సిబ్బందితో మాట్లాడి వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సీసీటీఎస్, కోర్టుకానిస్టేబుళ్లతో మాట్లాడి వారికి వృత్తిపరంగా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. స్టేషన్‌లో ఉన్న సిబ్బందిలో నైపుణ్యాలను గుర్తించి వారికి తగిన విధులు కేటాయించాలని సీఐని ఆదేశించారు. సైబర్ క్రైం సెల్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సోషల్ మీడియాలో అసత్యాలు, అభ్యంతరకర పోస్టులు పెట్టే వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎస్ఎం అలీని ఆదేశించారు. సెంట్రల్ క్రైం స్టేషన్‌ను తనిఖీ చేశారు. కడప రూరల్ సర్కిల్ కార్యాలయం, పెండ్లిమర్రి పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. బహిరంగ మద్యపానం జరిగే ప్రదేశాలను గుర్తించి దాడులు నిర్వహించాలని ఆదేశించారు. బహిరంగ మద్యపానం జరిగే ప్రదేశాలను క్రీడలకు అనువుగా తయారుచేసి యువతను షటిల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడలు ఆడేలా ప్రోత్సహించాలన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్‌లలో పాల్గొనే వారిపై బైండోవర్ కేసులతో పాటు పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు తగిన ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పాత నేరస్తులు, సస్పెక్ట్‌లతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి జీవన విధానం, డబ్బు ఎలా సంపాదిస్తున్నారో అడిగి తెలుసుకోవాలన్నారు. వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. రోడ్డుభద్రత నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగు కేసులను త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగగా ప్రతిరోజూ గ్రామాలకు వెళ్లి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఎస్పీ వెంట కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తాహిర్‌హుసేన్, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎస్ఎం అలీ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చాంద్‌బాషా, కడప రూరల్ సీఐ చల్లని దొర, పెండ్లిమర్రి ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫొటోలను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నప్పుడు.. అనంతరం అధికారంలో లేనప్పుడు జగన్‌లో ఎంతో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో సొంతూరు పులివెందులలో ఏనాడూ బసచేయలేదని చెప్పాలి. అలాగే ప్రజాదర్బార్ కూడా నిర్వహించిన దాఖలాలు లేవు. ఏడాదికి మూడుసార్లు.. అదీ వైఎస్ జయంతి, వర్ధంతి, క్రిస్మస్‌కు రావడం మినహా పులివెందులకు ప్రత్యేకంగా వచ్చి ప్రజలతో మమేకమైన పరిస్థితులు లేవు. అలాగే బంధువుల ఇళ్లకు గాని, నాయకుల ఇళ్లకు గాని వెళ్లి ఆశీర్వాదాలు, పలుకరింపులు లేవు. ఇప్పుడు మాత్రం పనిగట్టుకుని జగన్ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నెలలో రెండుమూడు సార్లు పులివెందులకు వస్తున్నారు.



అధికారం.. అంతమవగానే..

- నెలలో రెండుమూడు సార్లు సొంతూరికి జగన్
- ఇళ్లకు వెళ్లి పలకరింపులు, ఆశీర్వాదాలు
- పులివెందులలోనే బస, ప్రజాదర్బార్
- ఆశ్చర్యపోతున్న పులివెందుల ప్రజలు

కడప, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం 11గంటలకు హెలికాప్టర్ ద్వారా ఇడుపులపాయ వచ్చిన జగన్.. రోడ్డు మార్గాన ఇడుపులపాయ నుంచి వేంపల్లె మీదుగా పులివెందులకు చేరుకున్నారు. వేంపల్లెలో నూతనంగా వివాహమైన నూతన వధూవరులను ఆశీర్వదించారు, మరో ఇద్దరు నాయకులతో మాట్లాడారు. అక్కడి నుంచి పులివెందులకు 3గంటలకు వచ్చారు. అప్పటి నుంచి ప్రజాదర్బార్ నిర్వహించారు. తిరిగి మరుసటి రోజు ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించారు. మధ్యలో బంధువుల ఇళ్లకు, నాయకుల ఇళ్లకు వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి, బంధువులను పలకరింపులు చేశారు. గురువారం తెల్లవారుజామున బయలుదేరి బెంగళూరుకు వెళ్లారు.

అధికారంలో ఉండగా అంటీముట్టనట్టు..

ముఖ్యమంత్రి పదవి ఉన్నప్పుడు పులివెందుల ప్రజలతో జగన్ అంటీముట్టనట్లు వ్యవహరించారు. కానీ ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి నెల పులివెందులకు వచ్చి మూడు రోజులు గడిపేవారు. భద్రతా సిబ్బందిని పక్కనపెట్టి మరీ ఆయన అందరితో కలిసిపోయేవారు. జగన్ మాత్రం వాటికి దూరంగా ఉంటూ వచ్చారు. సామాన్యుడు జగన్‌ను కలవలేని పరిస్థితికి ఆయన వెళ్లిపోయారు. పదవి పోతూనే సామాన్యులు సైతం తనను కలవచ్చని సంకేతాలు వెళ్లేలా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు.

నాడు బంధువులను పట్టించుకోలేదు

మరోపక్క బంధువులను కూడా జగన్ నాడు పట్టించుకోలేదు. కానీ షర్మిలతో ఆస్తుల తగాదా కారణంగా ఇప్పుడు బంధువులను సైతం కలిసేందుకు జగన్ సుముఖత చూపుతున్నారు. బుధవారం ప్రజాదర్బార్ రాఆమంలో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి పెదనాన్న వైఎస్ ప్రకాశ్‌రెడ్డి ఇంటికెళ్లి ఆయనను పరామర్శించారు. సీపీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను కూడా కలిశారు. వైఎస్ కుటుంబంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా కుటుంబ సమావేశం నిర్వహించేవారు. అందులో సీపీ సుబ్బారెడ్డి ఉండేవారు. అందరూ ఒక తాటిపైకి వచ్చి పరిష్కరించుకునేవారు. వైఎస్ మృతి అనంతరం జగన్ అటు ప్రతిపక్షనేతగా, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇలాంటి వారిని పక్కన పెట్టేశారు. దీని కారణంగా కుటుంబంలో ఇప్పుడు ఏ సమస్య తలెత్తినా కుటుంబ సమావేశాలు జరగకపోవడంతో అవి మరింత పెద్దగా అవుతున్నాయని, వైఎస్ కుటుంబసభ్యుల్లో కొందరు గతంలో ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. వివేకానందరెడ్డి హత్య జరగడం, సునీత సీబీఐని ఆశ్రయించే సమయంలోనే అనాదిగా వస్తున్న కుటుంబ సమావేశం నిర్వహించి ఉంటే ఈ సమస్య జఠిలమయ్యేది కాదని అక్కడి వారు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా జగన్ పదవి ఉన్నప్పటి కంటే పదవి లేని సమయంలోనే ప్రజలతో మమేకమవుతున్నారనడం నగ్న సత్యం. తాను ఒంటరి అయిపోతున్నాననే భయంతో జనంతో మమేకం అయ్యే ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

ఆకాశవాణి.. కడప కేంద్రం!

● ఆరు దశాబ్దాలుగా ప్రసారాల్లో తన మార్కు ● ఉమ్మడి రాష్ట్రంలోనే కడపకు ప్రత్యేక గుర్తింపు

● అన్నివర్గాల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ● ఇప్పుడు ఎఫ్ఎంలో కూడా ప్రసారాలు



ఆరు దశాబ్దాలుగా రికార్డయిన నాటి సీడీలు



కడప ఆకాశవాణి కేంద్రంలో ఉన్న సంగీత పరికరాలు



5వ పేజీ తరువాయి

ఇలా ఒకటేంటి బోలెడు ప్రసారాలు అందించే వారు. జిల్లాలో అప్పట్లో జానపదానికి, ఇతర కళాకారులకు కొదవ లేదు. సాహిత్యం, సురభి నాటకాలు ప్రసిద్ధి చెందాయి. కడప కేంద్రం నుంచి పుట్టపర్తి నారాయణాచార్యులు, పినాకపాణి, ఎంఎల్ వసంతకుమార్, పులికంటి క్రిష్ణారెడ్డి, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, కేతు విశ్వనాథరెడ్డి, ఆరవేటి శ్రీనివాసులు, సొదుం జయరాం లాంటి ప్రముఖుల ప్రసారాలు ఇచ్చాయి. దివంగత సినీనటుడు గొల్లపూడి మారుతీరావు కడప రేడియో స్టేషన్‌లో పనిచేశారు. మంచి మంచి కార్యక్రమాలు ప్రసారం చేసి కడప స్టేషన్ విశేషంగా ఆకట్టుకుంది. ఇక చిత్రలహరి, చిత్రమంజరి పాటలు వచ్చేవి. ఉదయాన్నే సిగ్నేచర్ ట్యూన్‌తో ప్రారంభమై 5.50గంటలకు ప్రసారాలు మొదలయ్యేవి. సూక్తిరత్నావళి వచ్చేవి. అప్పట్లో ప్రతి ఇంట్లో రేడియో ఉండడంతో సుప్రభాతాలు, విశేషాలు వింటూ మహిళలు ఇంట్లో పనులు చేసుకుంటుండేవారు.

అదే క్రేజీతో ఇప్పుడూ ప్రసారాలు

చాలాకాలంగా దూరదర్శన్ ఉన్నప్పటికీ ఈటీవీ రాకతో ఎంటర్‌టైన్‌మెంట్‌లో మార్పులు వచ్చాయి. అప్పటి దాకా రేడియో ద్వారా వార్తలు, పొలం కబుర్లు, నాటికలు, సినిమా పాటలు, క్రికెట్ కామెంట్లు ఇతర ప్రసారాలు విన్న శ్రోతలు టీవీల రాకతో దానికి కనెక్ట్ అయ్యారు. ఆ తరువాత ఎలక్ట్రానిక్ మీడియా రావడంతో రోజువారి వార్తలు బ్రేకింగ్ పేరిట వచ్చేవి. అయితే ఎన్ని ఉన్నా కూడా రేడియోలో వార్తలు వచ్చాయంటే అది అధికారికంగా కన్‌ఫర్మ్ అయినట్లు. తరవాత కొద్దిరోజులు ఎఫ్ఎం రేడియో వచ్చింది. జాకీల పేరుతో రకరకాల యాంకరింగ్‌తో ఎఫ్ఎంకు కొద్దిరోజులు ఆదరణ పెరిగింది. అవి జనాల్లో ఉన్నాయి. అయితే ఎన్ని వచ్చినా రేడియో రేడియోనే అన్నట్లు దాని క్రేజ్ తగ్గడంలేదు. రేడియోలు నేరుగా కొనకపోయినా కార్లలో రేడియో ఎఫ్ఎంలు, మొబైల్‌లో ఎఫ్ఎంలు, న్యూస్ ఆన్ ఎయిర్ యాప్ మొబైల్‌లో ఉండడంతో ఇక ఈ ప్రసారాలన్నీ యధావిధిగా అందుతున్నాయి. కడప కేంద్రం నుంచి రేడియోతో పాటు ఎఫ్ఎం ద్వారా కూడా ప్రసారం చేస్తున్నారు. ఫోనులైన్ ద్వారా కోరుకున్న పాటలు శ్రోతలకు అందిస్తున్నారు. రేడియో ప్రసారాలు ఇప్పటికీ ఎంతలా ఆదరణ పొందుతున్నాయంటే కడప రేడియో స్టేషన్‌కు ఇప్పటికీ శ్రోతల నుంచి ఇన్‌లాండ్ కవర్లు, పోస్టు కార్డులు పెద్ద సంఖ్యలో రావడం గమనార్హం. ఉత్తరాల్లో శ్రోతలు రాస్తున్న వివరాలను సలహాలు సూచనలు చదివి వినిపిస్తున్నారు.

ప్రసారాలకు డిమాండ్

ఇన్ని మాధ్యమాలు ఉన్నా రేడియోకు క్రేజ్ తగ్గడం లేదు. ఎలాగంటే రేడియో ప్రోగ్రాం కోసం భారీ ఎత్తున ప్రకటనలు రావడం గమనార్హం. కాంతిరేఖలు పేరిట డాక్టర్ల సలహాలు ఇస్తుంటారు. దానికి పెద్దఎత్తున శ్రోతల నుంచి రెస్పాన్స్ వస్తుంది. అర్ధగంట ప్రోగ్రాంకు ఆ సమయంలో వచ్చే అన్ని ఫోన్లకు క్యారీ చేసి సమాధానం చెప్పలేపోతున్నారు. అందుకే ఈ ప్రోగ్రాం కోసం డాక్టర్లు క్యూలో ఉంటుంటారు.

అరుదైన సంపద

కడప రేడియో కేంద్రంలో సంగీతం, సాహిత్యానికి సంబంధించి అరుదైన సంపద ఉంది. ఆరు దశాబ్దాల నాటి సంగీత పరికరాలు, క్యాసెట్లు, సీడీలు ఉన్నాయి. వీటన్నింటికంటే ముఖ్యమైనది.. ప్రముఖుల స్వరం. రేడియో ద్వారా నాలుగైదు దశాబ్దాల ద్వారా కథో, కవితో వినిపించిన నాటి ప్రముఖుల ఆడియోలు ఇప్పటికీ ఇక్కడ భద్రంగా ఉన్నాయి. అప్పుడప్పుడు వారి కథలను పునర్ ప్రసారం చేస్తూ జిల్లా ప్రజలను ఆకాశవాణి అలరిస్తోంది.



విద్యార్థులతో యువవాణి నిర్వహిస్తున్న స్టేషన్ డైరెక్టర్

ప్రసారాలు ఇలా..

రోజూ ఉదయం 5.50కి సిగ్నేచర్ ట్యూన్ మొదలవుతుంది. 5.50కి మంగళధ్వని, దేశభక్తిగీతం, ఆ రోజు ప్రాముఖ్యత బట్టి వివరిస్తారు. 6.05కు న్యూస్, 6.10కి భక్తి రంజని, శుక్రవారం ముస్లింల కోసం ప్రసారం ఉంటుంది. 6.30కి సూక్తిరత్నావళి, 6.35కు పొలం కబుర్లు, 6.45కు ప్రాంతీయ వార్తలు, 7గంటలకు ఆ రోజు ప్రోగ్రాం వివరాలు, 7.05కు జాతీయ వార్తలు హైదరబాదు నుంచి రిలే, 7.15కు కాంతిరేఖల్లో రాయలసీమ సాహిత్యం, సలహాలు, సైన్స్ టెక్నాలజీ, ఇంటిలిజెన్స్ ఆర్టిఫిషియల్, చరిత్రలో ఈరోజు కూరగాయల ధరలు, శుక్రవారం గాంధిగారి ఆత్మకథ ఉంటాయి. 8.30కు సమాచార భారతి, 8.35కు చిత్ర మంజరి, 9 నుంచి 10గంటల వరకు వాట్సప్ ద్వారా మనోరంజని పాటలు, 10 నుంచి హలో అభిరుచి ఫోన్‌లైవ్ పాటలు ఉంటాయి. 11గంలకు శాస్త్రీయ సంగీతం, 12.05 నుంచి 12.30 వరకు కర్నాటక సంగీతం, 1.10 నుంచి 1.20 వరకు పసిడి పంటలు, తెగుళ్లనివారణ సస్యరక్షణకు ఎరువులు, 1.20కి ప్రాంతీయ వార్తలు, 1.30 నుంచి 1.45వరకు మహిళాభారతిలో వంటవార్పు తదితరాలు ఉంటాయి. తరువాత సాయత్రం 5వరకు బంద్. 5.15కి యువవాణి ప్రోగ్రాం ద్వారా పోటీ పరీక్షల కోసం క్విజ్, అభిప్రాయవేదిక యువతకు సంబంధించిన ప్రోగ్రాంలు ఉంటాయి. 6.30కి పల్లెప్రాంతాలు, రంగస్థలం, చెక్కభజన, ఫోక్‌సాంగ్స్, 6.50కి వ్యవసాయ సూచనలు, 7.15 నుంచి 7.45 వరకు పంటసీమలు, మార్కెట్‌ధరలు తదితరాలు, 7.45 నుంచి చిత్రలహరి ఉంటుంది. తరువాత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు ఉంటాయి. 9గంటలకు న్యూస్ ఆట్ నైన్, జాతీయ స్థాయిలో జరిగిన వార్తల వివరాలు, 9.16కు స్పాట్‌లైట్ అంటే జాతీయ వ్యాప్తంగా ఆ రోజు వార్తలు, 10 నుంచి 11 వరకు శాస్త్రీయ సంగీతం ఉంటుంది.



40 ఏళ్లనాటి రేడియో కం టేప్ రికార్డర్

అప్రమత్తంగా ఉండండి..

● చిరుతపులి సంచారంపై గ్రామాల్లో దండోరా



చిరుత సంచారంపై దండోరా వేయిస్తున్న ఎఫ్‌బీవో దీప

నిమ్మనపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లి సమీపంలో బోడికొండ వద్ద దూడను చిరుతపులి చంపిన విషయం తెలిసిందే. అయితే శనివారం అటవీశాఖ అధికారి ఎఫ్‌బీవో దీప సమీప గ్రామాలలో పర్యటించి చిరుతపులి సంచారంపై దండోరా వేయించారు. ఆమె మాట్లాడుతూ చల్లావారిపల్లి సమీపంలో అటవీ ప్రాతం ఉండడంతో రెండు రోజులుగా చిరుతపులి సంచరిస్తున్నట్లు తెలిపారు. పొలాల వద్దకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. అయితే చిరుతపులి హాని చేస్తుందని సంహరించేందకు కరెంటు వైర్లు తీయడం, మందులు పెట్టడం వంటివి చేయరాదని తెలిపారు. చిరుత కనిపించిన వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ప్రజలు రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కురబలకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన శనివారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పిచ్చలవాండ్లపల్లెకు చెందిన రెడ్డికిరణ్‌రెడ్డి (23) డిగ్రీ వరకు చదువుకుని ఇంటి వద్దనే ఉన్నాడు. కాగా ఇతను జల్సాలు, బెట్టింగ్‌కు అలవాటు పడి పలువురి దగ్గర వద్ద అప్పులు చేశాడు. గతంలో ఇతను చేసిన అప్పులను తల్లిదండ్రులు తీర్చారు. ఈ నేపథ్యంలో మళ్లీ తల్లిదండ్రులు కొనిచ్చిన ద్విచక్రవాహనాన్ని తాకట్టు పెట్టి రూ.50 వేలు అప్పు చేసి బెట్టింగ్‌కు పాల్పడి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని పలువురు అతడి తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావడంతో అతన్ని మందలించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్సల నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు సమాచారాన్ని ఆసుపత్రి ఔట్‌పోస్టు సిబ్బంది ముదివేడు పోలీసులకు అందించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కలికిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టపాళెం పంచాయతీ కుమ్మరపల్లె వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవరు అజాగ్రత్తగా నడపడంతో మోటారు సైకిల్‌పై వెళుతున్న యువకులు తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి ఆదేశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న హెడ్ కానిస్టేబుల్ కొండప్ప తెలిపిన వివరాల ప్రకారం.. వాల్మీకిపురం మండలం గండబోయనపల్లె పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన యువకులు ప్రభాకర్ (23), గణేష్ (20), మనోహర్ (19)లు కలికిరి నుంచి ద్విచక్ర వాహనంలో రాత్రి 7 గంటల సమయంలో స్వగ్రామం వెళుతుండగా కుమ్మరపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ మోటారు బైక్‌ను ఢీకొంది. డ్రైవర్ అజాగ్రత్తగా ట్రాక్టర్ నడపడంతో దానికున్న రోటావేటర్ కారణంగా ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ప్రభాకర్ కాలు మోకాలి వరకూ తెగిపడింది. మిగతా ఇద్దరికి కూడా బలమైన గాయాలు తగిలాయి. ప్రభాకర్‌ను వెంటనే వేలూరు సీఎంసీకి తరలించారు. మిగతా ఇద్దరినీ తిరుపతి ఆసుపత్రికి పంపారు. ఇందులో ప్రభాకర్ ఇంజనీరింగ్ పట్టభద్రుడు కాగా మిగతా ఇద్దరు స్థానిక కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ప్రభాకర్ తల్లి మేకల వసంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

15న అరుణాచలంకు రెండు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 15వ తేదీ గిరి ప్రదక్షిణకు మదనపల్లె ఆర్టీసీ వన్ డిపో నుంచి రెండు అల్ట్రా డీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. ఒక్కరికి రానుపోను టికెటు ధర రూ.805గా నిర్ణయించినట్లు తెలిపారు. అరుణాలచలం వెళ్లే భక్తులు టికెట్లు రిజర్వేషన్ చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు, బుకింగ్ కోసం డిపో మేనేజరు 9959225676, 7382875034, 9440858510కు సంప్రదించాలన్నారు.

10లోపు అభ్యంతరాలు తెలియచేయాలి

మదనపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గానికి జరగబోయే ఎన్నికలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 10వ తేదీ లోపు లిఖితపూర్వకంగా తెలియచేయాలని మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సీఈవో పీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గానికి ఈనెల 28న ఎన్నికలు జరుగుతాయని, ఇందుకు సంబంధించిన ఓటరు లిస్టు (ఏ-క్లాసు మెంబర్ల లిస్టు)ను బ్యాంకు నోటీసు బోర్డులో ప్రకటించినట్లు తెలిపారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 10వ తేదీ లోపు బ్యాంకు సీఈవోకు రాతపూర్వకంగా తెలియచేయాలని తెలిపారు. 11న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారన్నారు. గుర్తింపు కార్డు లేని ఏ-క్లాసు మెంబర్లు వెంటనే రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని బ్యాంకులో అందచేసి గుర్తింపు కార్డు పొందాలని పేర్కొన్నారు.

ఇచ్చేది గోరంత.. లాక్కునేది కొండంత

● ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజం

వేంపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇస్తున్నది గోరంత... లాక్కుంటున్నది కొండంత అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం ఆయన వేంపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ ఉచిత గ్యాస్ పథకం పేరుతో ప్రభుత్వం ఏడాదికి ప్రజలకు ఇస్తున్నది రూ.2,684 కోట్లు, కరెంటు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల నుంచి లాక్కుంటున్నది రూ.6,073 కోట్లు అన్నారు. ఇదికాక మరొకసారి సర్దుబాటు చార్జీల పేరుతో రూ.11,826 కోట్లు అదనపు భారం మోపబోతోందన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం ఉచిత గ్యాస్ పథకం అమలు కావడం లేదన్నారు. ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తామని మేనిఫెస్టోలో చెప్పారన్నారు. రాష్ట్రంలో 180 లక్షల కుటుంబాలు ఉన్నాయన్నారు. అందులో 154 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. 154 లక్షల గ్యాస్ కనెక్షన్లకు ఉచిత గ్యాస్ ఇవ్వాలంటే ఏడాదికి రూ.4,000 కోట్లు కావాలి, కానీ ప్రభుత్వం రూ.2,684కోట్లు మాత్రమే ఇస్తోందన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

● సుమో, ఒక కారుతో సహా 50 కేజీల గంజాయి స్వాధీనం

● వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న నలుగురు అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. శనివారం రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిందితుల వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. రాజంపేట డీఎస్పీ సుధాకర్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు, అర్బన్ ఇన్‌స్పెక్టర్ హేమసుందర్‌రావు, రాజంపేట రూరల్ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ, ఓబులవారిపల్లె తహసీల్దార్ శ్రీధర్‌రావు, ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్ సిబ్బందితో కలిసి మంగంపేట సమీపంలోని చెన్నకేశవగుడి సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక సుమో, ఒక కారులో ముగ్గురు మగవారు, ఒక మహిళ సుమారు 10 లక్షల విలువ చేసే 50 కేజీల గంజాయిని తిరుపతికి తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు.

నాలుగు ఎర్రచందనం కేసులు, నాలుగు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న పుల్లంపేట మండలం రంగంపల్లికి చెందిన కల్లపల్లి నాగేంద్ర, అతడితో సహజీవనం చేస్తూ తిరుపతి పట్టణం గాంధీనగర్‌కు చెందిన అన్నామలై ఆచారి భార్య కుమారి, కేరళ రాష్ట్రానికి చెందిన రెండు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న బాపురాజన్‌శ్రీని, చిత్తూరు జిల్లా పలమనేరు మండలం కాకతోపు వీధికి చెందిన షేక్ సలీంబాషాలు అరెస్టయిన వారిలో ఉన్నారన్నారు. ఈ గంజాయి అక్రమ రవాణా, విక్రయాల్లో వీరితో పాటు మరికొంతమంది ప్రమేయం ఉందని తెలిపారు.

వీరిపై ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పెట్టనున్నట్లు ఎస్పీ తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, అక్రమ రవాణా చేసినా, అందుకు సహకరించినా వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని ఎస్పీ హెచ్చరించారు. అలాగే గంజాయి అక్రమ రవాణా కేసుల్లో ఎక్కువ సార్లు దొరికిన వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణా కేసులో ముద్దాయిలను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. గంజాయి కేసులో ముద్దాయిలను పట్టుకోవడంలో భాగంగా ప్రమాదవశాత్తు ఓబులవారిపల్లె ఎస్ఐ మహేశ్‌నాయుడు కిందపడి చేతికి గాయాలైనప్పటికీ లెక్కచేయకుండా నిందితులను అరెస్టు చేసినందుకు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

యువతకు భరోసా కల్పించిన నారా లోకేశ్ అమెరికా పర్యటన

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీశ్



అమెరికాలో నారా లోకేశ్‌తో వేమన సతీశ్

రాజంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రగతికి యువత భవితకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన ఎంతో ఉపయోగపడిందని తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీశ్ తెలిపారు. మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన ఆద్యంతం తాను నారా లోకేశ్‌తో గడిపానని అన్నారు. నారా లోకేశ్‌తో పాటు అమెరికా పర్యటనలో పాల్గొని ఆయనతో పాటు తిరిగు ప్రయాణం సందర్భంగా వేమన సతీశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణం తీరిక లేకుండా అమెరికాలో పలు ప్రఖ్యాత కంపెనీలతో సుదీర్ఘ చర్చలు జరిపి రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన అవకాశాలు వివరిస్తూ ఆయన చేసిన ప్రసంగం అక్కడి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకుందన్నారు. ఆయన అమెరికా పర్యటన వల్ల ఎన్నో పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు.

పాత సామాన్లు అమ్ముతాం

● ధరలు మాత్రం తగ్గించం ● ఎక్సైజ్ శాఖ వింత నిర్ణయం





మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో భద్రపరచిన పాత ఫ్రీజర్లు, బ్యాటరీలు

మదనపల్లె టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా.. ఏవైనా వస్తువులు కొనుగోలు చేసి వాటిని ఐదేళ్ల పాటు ఉపయోగించాక, వాటిని తిరిగి అమ్మాలంటే తరుగు (డిప్రిసియేషన్) తీసేసి విక్రయిస్తారు. ద్రవ్యోల్బణం సూత్రం ప్రకారం వస్తువులు వాడిన ఏడాదికి ఎంత లేదన్నా కొనుగోలు ధరలో 10 శాతం తీసివేసి అమ్మడం చూస్తుంటాం. కానీ రాష్ట్ర అబ్కారీ శాఖ మాత్రం ఐదేళ్ల పాటు ఉపయోగించిన వస్తువులను బుక్‌వాల్యూ ధర కన్నా అదనంగా విక్రయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అదీకాక ఆ వస్తువులను బహిరంగ వేలంలో విక్రయించడంతో పాటు, వచ్చిన ధరకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం చూస్తే ఇదెంత వింత నిర్ణయమో చూసే వారిని విస్మయం కలిగించకమానదు.

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 109 ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన ఎక్సైజ్ పాలసీ విధానం తీసుకొచ్చి ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎత్తివేసింది. ఈ క్రమంలో జిల్లాలోని ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని 109 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వినియోగించిన ఫ్రీజర్లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, లేబుల్ స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్ చెస్టులు అన్నింటిని కలిపి ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని మదనపల్లె, కడప ఏపీఎస్‌బీసీఎల్ డిపోలకు తరలించారు. వీటితో పాటు గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మిగిలిపోయిన మద్యంను కూడా డిపోలకు తరలించారు.

వేలంలో కొనుగోలు చేయండి

రాష్ట్రంలోని ప్రభుత్వం మద్యం దుకాణాల్లో స్వాధీనం చేసుకున్న పాత సామాన్లను బహిరంగ వేలంలో విక్రయించాలని ఎక్సైజ్‌శాఖ (ఏపీఎస్‌బీసీఎల్) బోర్డు డైరెక్టర్లు గత నెల 23వ తేదీ సమావేశమై తీర్మానించారు. ఈ మేరకు ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ రాష్ట్రంలోని అన్ని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లకు, ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్లకు ఉత్తర్వులను పంపారు. అంతా సక్రమంగా ఉంటే ఇందులో పెద్ద వింతేమి లేదు..కానీ ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న ఫ్రీజర్లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, లేబుల్ స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్ చెస్టులకు బుక్ వాల్యూ నిర్ణయించారు. ఈ ధరల కన్నా 20 శాతం అప్‌సెట్ ధరలు నిర్ణయించి బహిరంగ వేలం నిర్వహించి హెచ్చు పాటదారుడికి విక్రయించాలని ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవంగా హారిజాంటల్ ఫ్రీజర్ (బీర్లు కూలింగ్ చేసేవి) 1000 లీటర్ల సామర్థ్యం ఉండేవి మార్కెట్‌లో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ధరలు ఉన్నాయి. ఐదేళ్ల పాటు ఈ ఫ్రీజర్లు ఉపయోగించిన దరిమిలా వీటి డిప్రిసియేషన్ ఎంత లేదన్నా ఏడాదికి రూ.3 వేలు చొప్పున ఐదేళ్లకు రూ.15 వేలు తీసివేయాల్సి ఉంది. అంటే ఉపయోగం (ఆపరేటింగ్‌లో) ఉన్న ఫ్రీజర్ ధరలు గరిష్టంగా రూ.10 నుంచి రూ.15 వేల వరకు వెచ్చించి తీసుకోవచ్చని ఫ్రిజ్ మెకానిక్‌లు చెబుతున్నారు. అవే ఫ్రీజర్లో అమ్మోనియం గ్యాస్ లీకేజి అయిపోయి, మరమ్మతులకు గురైన ఫ్రీజర్లను రూ.5 వేల వరకు కొనుగోలు చేయవచ్చని మెకానిక్‌లు చెబుతున్నారు. కానీ వాస్తవంగా ఎక్సైజ్‌శాఖ అధికారులు నిర్ణయించిన ధరల ప్రకారం ఫ్రీజర్ ధర బుక్ వ్యాల్యూ ప్రకారం రూ.18,900 ఉండగా, అప్‌సెట్ ధరను 20 శాతం పెంచి రూ.22,680గా నిర్ణయించారు. ఈ ధరను అప్‌సెట్ ధరగా (సర్కారు పాట) పెట్టి బహిరంగ వేలం నిర్వహించి హెచ్చుపాటదారుడు ఎవరైనా ఉంటే వారికి ఫ్రీజర్‌ను అప్పగిస్తారు. అంతేకాదు సుమా ఈ పాటదారుడు పాడిన ధరకు అదనంగా 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంది. ఇదే కోవలో ఇన్వర్టర్లు, బ్యాటరీలు, లేబుల్ స్కానర్లు (అన్నీ ఎలక్ట్రానిక్ వస్తువులే) ధరలు కూడా బుక్ వ్యాల్యూకి 20 శాతం అదనంగా అప్‌సెట్ ధరలు నిర్ణయించారు. అసలే ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆపై ఐదేళ్ల పాటు వాడి పడేశారు. వీటి ప్రస్తుత ధరలు మార్కెట్‌లో ఏ సామాన్యుడిని అడిగినా టక్కున ఎంతకు కొనుగోలు చేయవచ్చో ఇట్లే చెప్పేస్తారు. అలాంటి ఫ్రీజర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కువ ధరలకు బహిరంగ వేలంలో విక్రయించాలని ఎక్సైజ్‌శాఖ అధికారులు తీసుకున్న వింత నిర్ణయంతో ఈనెల 7వ తేదీ కడప, మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపోల్లో నిర్వహించే పాత సామాన్ల బహిరంగ వేలంలో ఈ పాత సామానులు అమ్ముడుపోతాయా..? అన్నదే వెయ్యి డాలర్ల ప్రశ్నగా మారనుంది.

పారదర్శకంగా ఎక్సైజ్ వస్తువుల వేలం

● డిపో మేనేజర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్

మదనపల్లె ఎక్సైజ్ డిపో పరిధిలో స్వాధీనం చేసుకున్న వస్తువులను పారదర్శకంగా వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం పుంగనూరు రోడ్డులోని ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో పరిధిలోని 69 ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న ఫ్రీజర్లు, ఇన్వర్టర్ బ్యాటరీలు, స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు, క్యాష్ చెస్టులను డిపోలో భద్రపరిచామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వస్తువులను ఈనెల 7వ తేదీ డిపో ఆవరణంలో బహిరంగ వేలం వేస్తామన్నారు.

ఆసక్తి గల వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. హెచ్చుపాటదారుడికి ఆయా వస్తువులను అప్పగిస్తామన్నారు. అలాగే డిస్టిలరీల నుంచి వచ్చే స్టాకు ఆధారంగా డిపో పరిధిలోని 69 ప్రైవేటు మద్యం దుకాణాలను విభజించి, రేషన్ ప్రకారం సరఫరా చేస్తున్నామన్నారు. వేలం పాట నిర్వహణ వివరాల కోసం స్టోర్ మేనేజర్ 9701777938, 8639494220, 9866144462 నెంబర్లకు ఫోన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆదికేశవులు, సీఐ ప్రశాంత్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఏదైనా మేం చెప్పేదే జరగాలి, మేం వచ్చేదే సమయం. అధికారులు ఎవరు వచ్చినా మాకోసం నిరీక్షించాల్సిందే. ఉమ్మడి జిల్లా అధికారులు అన్ని పనులను వదులుకుని జిల్లా, డివిజన్, అధికారులు సమావేశానికి వస్తుంటారు. అయినా వైసీపీ అధీనంలోని జడ్పీ పాలకమండలి సభ్యులు (జడ్పీటీసీలు) స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని మరిచి చైర్‌పర్సన్ చాంబర్‌లో ముచ్చట్లలో మునిగిపోయారు. జడ్పీ సీఈఓ ఓబులమ్మ కూడా చైర్‌పర్సన్ చాంబర్‌కు వెళ్లి నేను సైతం అంటూ వారితో మమేకమయ్యారు. ఆయా శాఖల జిల్లా అధికారులను 45 నిమిషాలు నిరీక్షింప చేయడంతో వారు తీవ్ర అసహనానికి లోనయ్యారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇలాంటి నిరీక్షణ సహజమేనని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా కొనసాగుతుండడంపై అధికారులు అవాక్కవుతున్నారు. అధికారి స్థాయి ఏదైనా తప్పదన్నట్లు వేచిచూడాల్సిందే అన్నట్లుగా జరిగింది. వివరాల్లోకెళితే...

మేం వచ్చేదే సమయం

- స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని పట్టించుకోని వైసీపీ పాలకమండలి
- చైర్‌పర్సన్ చాంబర్‌లో మాటా మంతీ
- నేను సైతం అన్న సీఈఓ
- అసహనానికి లోనైన అధికారులు
- రెండు గంటలకే మమ...!
- నవ్విపోదురుగాక మాకేంటి




జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శారద, సీఈఓ ఓబులమ్మ తదితరులు - వైసీపీ పాలక వర్గం కోసం ఎదురు చూస్తున్న అధికారులు

కడప రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సమావేశహాలులో శనివారం నిర్వహించిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం నవ్విపోదురుగాక మాకేంటి అన్నట్లుగా కొనసాగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశాలను 45 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభించారు. (ఉమ్మడి కడప జిల్లా) కడప, అన్నమయ్య జిల్లాల నుంచి దాదాపు 30 శాఖల అధికారులు నిర్వాహకులు నిర్దేశించిన సమయానికి హాజరయ్యారు. వైసీపీ అధీనంలోని జడ్పీ పాలకమండలి (జడ్పీటీసీలు) చైర్‌పర్సన్ చాంబర్‌లో ముచ్చట్లలో మునిగిపోయారు. జడ్పీ సీఈఓ ఓబులమ్మ కూడా వారితో మమేకమయ్యారు. సమావేశ నిర్వాహకులు తమ బాధ్యతను పక్కనపెట్టి వైసీపీ పాలకమండలి చుటూ ప్రదక్షిణలు చేస్తుండడంతోనే సమావేశాలు ఆలస్యంగా కొనసాగుతున్నాయన్న విమర్శలు చక్కర్లు కొడుతున్నాయి. చివరికి ఓ అధికారి చైర్‌పర్సన్ చాంబర్‌కువెళ్లి 10-45 నిమిషాలు కావస్తోంది అధికారులు నిరీక్షిస్తున్నారని చెబితే సమావేశం ప్రారంభించారు.

ప్రేక్షక పాత్రలో కమిటీల చైర్మెన్లు

స్థాయీ సంఘాల కమిటీల సమావేశంలో ఆయా కమిటీల చైర్మెన్‌లు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ జె. శారద ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణ అభివృద్ధి, విద్య, వైద్య సేవల, పనుల, మహిళా సంక్షేమం స్థాయీ సంఘాలకు చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. కానీ ఆయా సంఘాల సమీక్షలో జడ్పీ చైర్‌పర్సన్ ఒక్క మాటకూడా మాట్లాడకుండా ఉత్సవ విగ్రహంలా ప్రేక్షక పాత్రవహించారు. సాంఘిక సంక్షేమం స్థాయీ సంఘానికి చిట్వేలి జడ్పీటీసీ పుష్పలత చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఈమె కూడా తమ కమిటీ చర్చలో ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. వ్యవసాయం స్థాయీ సంఘానికి పిట్టు బాలయ్య(జడ్పీ రెండో చైర్మెన్) చైర్మెన్‌గా ఉన్నారు. ఈయన మాత్రం వ్యవసాయ, అనుబంధశాఖల చర్చలో ఒకటి, రెండు పసలేని ప్రశ్నలను సంధించి వారికంటే ఈయనే నయమనిపించారు.

అంతా గందరగోళం

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వాహకులు గందరగోళంగా నిర్వహించారు. కమిటీలోని ఆయాశాఖల అధికారుల సమీక్ష జరుగుతుండగానే మరో కమిటీశాఖలపై సభ్యులు ప్రశ్నలను సంధించారు. దీంతో ఏ అధికారి ఏ సమాధానం చెప్పాలో అర్థం కాక గడిబిడ ఏర్పడింది. ఒక రకంగా చెప్పాలంటే క్రమశిక్షణ ఉల్లఘించారనే అపవాదు నెలకొంది. గ్రామీణ అభివృద్ధి స్థాయీ సంఘం సమావేశం పరిధిలోని ఆయా శాఖల అధికారులు వేదికపైకి వచ్చి సమాధానాలు వినిపిస్తుండగానే వ్యవసాయ స్థాయీ సంఘం ఉద్యానశాఖ సభ్యులు ప్రశ్నలు అడిగారు. దీంతో ఎవరు, ఎవరికి ఏ సమాధానం చెప్పాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

అరకొరగా సమస్యలపై చర్చ

జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో ఆయా శాఖల సమీక్షను అరకొరగా చర్చసాగించారు. మొత్తం ఏడు స్థాయీ సంఘాల్లో మూడు, నాలుగు మాత్రమే చర్చించి మిగిలిన వాటిని మడతపెట్టేశారు. ప్రణాళిక, ఆర్థికస్థాయీ సంఘ పరిధిలో ముఖ్యమైన శాఖలను వదిలి పీఆర్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఫైనాన్స్ శాఖలను మాత్రమే చర్చించి వదిలేశారు. గ్రామీణ అభివృద్ధి సంఘంలో మొత్తం ఏడు శాఖల్లో డీఆర్‌డీఏ, డ్వామాపై మాత్రమే చర్చించారు. విద్య, వైద్యసేవల స్థాయీ సంఘంలో మొత్తం 9 శాఖల్లో డీఎంఅండ్‌హెచ్‌ఓ, డీఈఓ శాఖలపై మాత్రమే అరకొరగా చర్చించారు. వ్యవసాయ స్థాయీ సంఘంలో మొత్తం 12 శాఖల్లో కేవలం వ్యవసాయశాఖ, ఉద్యానశాఖలపైనే బరువుబరువుగా చర్చించి చేతులు దులిపేసుకున్నారు.

మొక్కుబడి సమావేశాలు

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను మొక్కుబడిగా నిర్వహించారు. గతంలో ఆయా స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఆయా కమిటీల చైర్మెన్‌ల ఆధ్వర్యంలో ఒక్కొక్కటిగా నిర్వహించేవారు. ఈసారి మూకుమ్మడిగా అన్ని కమిటీల సమావేశాలను నిర్వహించారు. దీంతో ఒక కమిటీలోని సభ్యులు మరో కమిటీ ప్రశ్నలను లేవనెత్తి గందరగోళానికి నాందిపలికారు.

రెండు గంటలకే మమ

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వాహకులు రెండుగంటలకే మమ అనిపించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశాన్ని 10:45 గంటలకు ప్రారంభించి 1 గంటకు ముగించి ఓ పనైపోయిందనిపించారు.

పేలవంగా సమావేశం

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని పేలవంగా నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతో సంఘ సభ్యులు(జడ్పీటీసీలు) శాఖల పనితీరు, సంక్షేమ పథకాలపై అరొకొరగా పసలేని చర్చ కొనసాగించారు. జడ్పీ వైస్ చైర్మెన్ పిట్టు బాలయ్య యాదవ్, కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, రామాపురం జడ్పీటీసీ వెంకటరమణ, బి.కోడూరు జడ్పీటీసీ దావీదు, కమలాపురం జడ్పీటీసీ ఎల్. సుమిత్రా తదితరులు పలు మండలాల్లో అసమతుల్య వర్షాల కారణంగా ఖరీఫ్ పంటలు ఎండి రైతులు అల్లాడుతున్నారని, ఆయా మండలాలను కరువు మండలాలుగా గుర్తించడంలో వ్యవసాయశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ఆర్ జలకళ ద్వారా వేసిన బోర్లకు మోటార్లను అమర్చలేదని పైగా విద్యుత్ సరఫరా ఇంత వరకు ఇవ్వకపోవడం దారుణమని పోరుమామిళ్ల జడ్పీటీసీ చెన్నయ్య అడిగారు. జిల్లాలోని ఆయా షాదిఖానాల ద్వారా వచ్చే ఆదాయం ఏ ఖాతాలో జమ అవుతుందో తెలియడంలేదని వాటి వివరాలను తెలపాలని పలు సమావేశాల నుంచి కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని కో-ఆప్షన్ సభ్యులు ఎ. కరీముల్లా మండిపడ్డారు. ఆర్‌బీకేల నిర్మాణాలకు బిల్లులు సక్రమంగా రావడంలేదని వాటిని వెంటనే చెల్లించాలని, కడప - పులివెందుల మార్గంలోని ఎల్లటూరు వద్ద రోడ్డుపై వర్షపు నీరు నిలబడడంతో రోడ్డు అధ్వాన్నంగా ఉందని వీటి పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే చేపట్టాలని జడ్పీ వైస్‌చైర్మన్ బాలయ్య పేర్కొన్నారు. పోరుమామిళ్ల మండలంలో నాడు-నేడు పథకం ద్వారా చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని పూర్తిచేయాలని జడ్పీటీసీ చెన్నయ్య తెలిపారు. అభివృద్ధి పనులకు జడ్పీటీసీల నుంచి కూడా ప్రతిపాదనలు తీసుకోవాలని, మండల స్థాయిలోని హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీలో సభ్యులుగా ఉంచాలని వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మెన్ బాలయ్య యాదవ్ కోరారు. సమావేశాల్లో డిప్యూటీ సీఈఓ మైథిలి, ఆయాశాఖల అధికారులు, జడ్పీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



రక్తపు మడుగులో పడివున్న ప్రవీణ్ మృతదేహం

సిద్దవటం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడప - చెన్నై జాతీయ రహదారిపై జేఎంజే కాలేజ్ కోతులు తూము వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్(19) అక్కడికక్కడే మృతి చెందగా రోహిత్ కుమార్(20) చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాల్లోకెళితే....

అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ఇసుకపల్లె యువకులు ప్రవీణ్, రోహిత్‌కుమార్ కడప నుంచి రాజంపేటకు బైక్‌లో వెళుతుండగా తిరుపతి నుంచి కడపకు వస్తున్న పులివెందుల డిపో ఆర్టీసీ బస్సు జేఎంజే కాలేజీ వద్ద బైక్‌ను ఢీకొంది. దీంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రగాయాలపాలైన రోహిత్‌ను వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రోహిత్ మృతి చెందాడు. సిద్దవటం పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో చైన్ స్నాచర్



షేక్ ఆజాం అలి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ

మైదుకూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో చైన్ లాక్కెళ్లిన షేక్ ఆజాం అలి సేట్‌ను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ మైదుకూరులో దసరా వేడుకల్లో అమ్మవారిశాల వద్ద నిలబడి ఉన్న మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన నిందితుడిని సీఐ హసం, ఎస్ఐ మద్దిలేటి ముమ్మరంగా గాలించారు. కడప పట్టణం మోచంపేటకు చెందిన షేక్ ఆజాం అలి సేట్‌ని మైదుకూరు బైపాస్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా ఇతనిపై మైదుకూరు, ప్రొద్దుటూరు, మన్నూరు పోలీస్‌స్టేషన్లలో మూడు చైన్ స్నాచింగ్ కేసులు, మైదుకూరులో మోటార్ సైకిల్ చోరీ కేసు ఉన్నట్లు తేలినట్లు డీఎస్పీ తెలిపారు. ఇతని నుంచి రెండు మోటార్‌సైకిళ్లు, 70.5 గ్రాముల బరువు గల నాలుగు బంగారు చైన్‌లు స్వాధీనం చేసుకున్నారు. షేక్ ఆజాం అలిని పట్టుకోవడానికి సహకరించిన వారిలో కానిస్టేబుల్స్ రమణ, శివ, గణేష్, నవీన్, తిరుమలయ్య ఉన్నారు.

ఉర్దూ సెమినార్‌కు అమీర్‌బాబు లక్ష విరాళం



మంత్రి ఫరూక్‌కు లక్ష రూపాయల చెక్కును అందిస్తున్న అమీర్‌బాబు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న జాతీయ ఉర్దూ సెమినార్‌కు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్ బాబు లక్షరూపాయలు విరాళం ప్రకటించారు. శనివారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు లక్ష రూపాయలు చెక్కు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఉర్దూ మాధ్యమాన్ని పటిష్టపరచాలని కోరారు. ఈ సంస్థల్లోని అన్ని ఖాళీలు భర్తీ చేసి మైనార్టీ విద్యార్థులు నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. మంత్రి ఫరూక్ స్పందిస్తూ ఖాళీ ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అంజుమన్ తరఖ్ఖీ అధ్యక్షుడు సత్తార్‌సాహిర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అష్రఫ్‌ఆలీఖాన్, నజీర్ అహ్మద్, జిలానీబాషా, సలావుద్దీన్, మగ్బుల్ అహ్మద్, సిరాజుద్దీన్ బుకారి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

- మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు సురేశ్‌రెడ్డి అన్నారు. రెండురోజుల పాటు నిర్వహించిన మెప్మా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ జిల్లాస్థాయి వర్క్‌షాపునకు శనివారం ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులను గుర్తించడానికి వారి సామాజిక ఆర్థిక స్థితిగతులు వాస్తవిక సమాచారంతో కచ్చితమైన డేటాబేస్ అవసరమన్నారు. ప్రామాణికమైన డేటాను కలిగి ఉండడానికి ఎస్‌హెచ్‌సీ సభ్యుల జనాభా, ఆర్థిక వృత్తిపర వివరాలను కవర్ చేస్తూ డేటా ప్యూరిఫికేషన్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. దీనికోసం కోసం మెప్మా ఎండీ ఆధ్వర్యంలో ఒక ఆండ్రాయిడ్ అప్లికేషన్ అభివృద్ధి చేశారన్నారు. దీని ద్వారా రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీలు) అన్ని గ్రూపుల్లోని సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారని తెలిపారు. ఇందులో సీవోలు, సీఎంఎంలు, టీఈలు చివరగా పీడీ ఈ డేటాను ధ్రువీకరించి డిసెంబరు చివరి నాటికి డేటా మొత్తం ప్యూరిఫై చేస్తారన్నారు. జిల్లా స్థాయి వర్క్‌షాపులో కింది స్థాయి సిబ్బందికి ఈ మొబైల్ యాప్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో శిక్షణ ఇచ్చారు.

వైవీయూ ఎంబీఏ పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎంబీఏ హెచ్‌ఆర్‌ఎం నాలుగో సెమిస్టరు ఫలితాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు క్రిష్ణారావు ఎంబీఏ విభాగం డీన్ ప్రొఫెసరు సుబ్బరాయుడు విడుదల చేశారు. శనివారం వీసీ చాంబరులో ఫలితాలు విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ ఎంబీఏ హెచ్‌ఆర్‌ఎంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులను అధ్యాపకులను వారు అభినందించారు.

నీళ్ల కోసం రోడ్డెక్కిన మహిళలు

ఇరవై రోజులుగా నీటిని విడుదల చేయని అధికారులు

బిందెలతో హరిజన మహిళల ఆందోళన



నీళ్ల కోసం బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

పులివెందుల టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిష్టియన్ లైన్‌లో నీళ్ల కోసం మహిళలు రోడ్డెక్కారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ సొంత ఊర్లో నీళ్ల కోసం మహిళలు బిందెలతో రోడ్డుపై నిరసన చేయడం చర్చనీయాంశంగా మారింది. శనివారం ఉదయం క్రిస్టియన్‌లైన్‌లో మహిళలందరూ బిందెలు తీసుకుని రోడ్డుపైకి వచ్చి మాకు నీళ్లు ఇప్పించే నాథుడే లేరా అంటూ నిరసన వ్యక్తం చేశారు. కేవలం దళితులమని, మాలలమనే మాకు నీటి సరఫరా చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని హరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. హరిజనులకు నీళ్లు అవసరం ఉండవా అంటూ ప్రశ్నించారు. కనీసం బాత్‌రూం వెళ్లడానికి కూడా నీళ్లు లేవని అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని 20 రోజులుగా చుక్క నీరు కూడా విడుదల చేయలేదని మేమే రూ.600 చెల్లించి ట్యాంకు నీల్లు తెప్పించుకోవాల్సి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఎన్నిరోజులు నీళ్లు తెచ్చుకోవాలా అని, మేం కూడా పన్నులు కడుతున్నామని మాకు మీరు ఎందుకు ఇవ్వరంటూ వారు వాపోయారు. కౌన్సిలర్ దృష్టి కి తీసుకెళ్తే ఒక ట్యాంకు పంపించారని, ఒక ట్యాంకు నీళ్లమూడు వీధులకు ఎలా సరిపోతాయన్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు అధికారులు కానీ మా మొర విని మాకు తాగునీటి సమస్య లేకుండా చేయాలని వారు కోరారు.

ఎంటీఎంను అమలు చేయండి



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వేంపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మినిమమ్ టైంస్కేల్ అమలుచేయాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు చేయించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. శనివారం ట్రిపుల్‌ఐటీ అధ్యాపక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పులివెందులలో ఉన్న ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 400కు పైగా అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, శాశ్వత ప్రాతిపదికన భర్తీచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

పోలీసు సొసైటీపై విచారణ

కడప (క్రైం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలీసు వెల్ఫేర్ సొసైటీ డబ్బు వ్యత్యాసం ఉండడంతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. పోలీసు సిబ్బంది అవసరాల నిమిత్తం సొసైటీలో రుణం తీసుకుని తిరిగి చెల్లిస్తుంటారు. దాదాపు సొసైటీలో రూ.60 లక్షల మేర వ్యత్యాసం రావడంతో ఎస్పీ విచారణకు ఆదేశించారు.


అవినీతి ఆరోపణలపై కానిస్టేబుల్ సస్పెన్షన్

బద్వేలుటౌన్, నవంబరు2, (ఆంధ్రజ్యోతి): బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నాగసుబ్బయ్య సస్పెన్షన్‌కు గురయ్యారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆ కానిస్టేబుల్‌ను సస్పెండ్‌చేసినట్లు సమాచారం.

వివాహిత ఆత్మహత్య

కడప క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడపనగరం కాగితాలపెంటలో వివాహిత షేక్ ఫిర్‌దోస్ (40) ఉరి వేసుకున్నట్లు కడప తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కాగితాల పెంటకు చెందిన షేక్ ఫిర్‌దోస్ కడప వాసి కరీముల్లాతో 17 ఏళ్ల కిందట వివాహం మైంది. కొన్ని నెలలుగా భర్త వేధింపులు తాళలేక తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



పెంచలయ్య మృతదేహం

రాజంపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెంకటరాజంపేట గ్రామంలో శనివారం ఉదయం కారు ఢీకొని పెనగలూరు పెంచలయ్య(68) అక్కడికక్కడే మృతిచెందాడు. తిరుపతి నుంచి కడప వైపునకు వెళుతున్న కారు అదుపు తప్పి పెంచలయ్యను ఢీకొంది. తలకు తీవ్ర గాయాలవడంతో మృతి చెందాడు. మన్నూరు సీఐ రామాంజనేయులు, పోలీసులు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృత దేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జీవిత ఖైదీ పరార్

కడప (క్రైం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఓ జీవిత ఖైదీ పరారయ్యాడు. దీంతో జైలు అధికారులు అతన్ని శనివారం అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి తిరుపతికి సంబంధించిన ఓకేసులో కడప సెంట్రల్ జైలులో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్నాడు. అతను సత్ప్రవర్తనతో ఉండడంతో బేకరీలో పనిచేసేందుకు అధికారులు అనుమతించారు. ఇదే అదనుగా భావించిన ఆ ఖైదీ రెండు రోజుల కిందట పరారయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుట్టుచప్పుడు కాకుండా అధికారులు అతన్ని పట్టుకుని జైలుకు తరలించారు.

బెయిల్‌పై విడుదలైన ఖైదీ హల్‌చల్

నంద్యాలలో ఓ కానిస్టేబుల్ హత్య కేసులో కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వ్యక్తికి శనివారం బెయిల్ మంజూరైంది. కాగా ఇతన్ని మరో కేసులో అరెస్టు చేసేందుకు నంద్యాల పోలీసులు అక్కడికి రావడంతో ఆ వ్యక్తి జైలు ఆవరణలోని నీళ్ల ట్యాంకు పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. దీంతో పోలీసులు, జైలు సిబ్బంది చాకచక్యంగా అతన్ని అదుపులోకి తీసుకుని నంద్యాలకు తరలించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో స్కార్పియో దగ్ధం

చక్రాయపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయ స్వామి ఆలయం సమీపంలో శనివారం వైర్లు షార్ట్‌సర్క్యూట్‌తో ఒక స్కార్పియో దగ్ధమైంది. వివరాల్లోకెళితే.... బద్వేలు నియోజకవర్గం అట్లూరు మండలం పాతఅట్లూరు వాసి మన్నూరు నరసింహులు ఏపీ16బియు0349 స్కార్పియో పూర్తిగా దగ్ధమైంది. సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య చొరవతో దేవస్థాన సిబ్బంది అలర్ట్ అయ్యారు. వేంపల్లె ఫైర్‌స్టేషన్ సిబ్బంది వచ్చి పూర్తిగా మంటలను అదుపు చేశారు. నరసింహులు తన బంధువులతో శనివారం ఉదయం గండికి వచ్చి స్కార్పియోను అర్చకుల క్వార్టర్స్ సమీపాన ఉంచి పాపాఘ్నిలో స్నానమాచరించి అంజన్న దర్శనానికి వెళ్లారు. అంతలో స్కార్పియోకు మంటలు అంటుకున్నారు. వాహనంలో రూ.25వేలు నగదు, పాస్‌బుక్కులు, వివిధ రకాల కార్డులు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు కూడా మంటలను అదుపుచేసేందుకు సహకరించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కమలాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేశామని సీఐ రోషన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు కడప ఎస్‌డీపీఓ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కమలాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రోషన్ కమలాపురం ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, వల్లూరు పోలీసు సిబ్బంది శనివారం మైదుకూరు టౌన్, ప్రొద్దుటూరు రోడ్డు నుంచి కడపకు వచ్చే బైపాస్‌లో మూలబాట వీధి సర్వీసు రోడ్డు వద్ద మధ్యాహ్నం హత్యకు పాల్పడి పరారీలో ఉన్న వ్యక్తులను పంచాయతీదారుల సమక్షంలో అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వారు తెలిపారు.

ఎలక్ట్రీషియన్‌పై దాడి - కేసు నమోదు

పుల్లంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాములపేట వాసి ఎలక్ట్రీషియన్ రమణయ్యపై దళవాయిపల్లె వాసులు ఐదుగురు దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పిచ్చయ్య తెలిపారు. పనికి రావాలని పిలవగా డబ్బు సకాలంలో ఇవ్వరని అన్నందుకు ఇంటికి వచ్చి ఐదుగురు దాడి చేశారన్నారు.

సంక్షిప్తం

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలు తగ్గించాలని, పేదరికాన్ని నిర్మూలించాలని కోరుతూ పీఎస్‌యూ, ఆర్‌ఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో నవంబరు 28న ఢిల్లీలో జరిగే పార్లమెంటు మార్చ్‌ను జయప్రదం చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర కన్వీనరు సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. శనివారం పీఎస్‌యూ కార్యాలయంలో పోస్టరును విడుదల చేశారు.

వీఆర్‌ఏల సమస్యలపై 4న ధర్నా

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలపై ఈనెల 4వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు ఏపీ వీఆర్‌ఏల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, వెంకటపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, జిల్లా కోశాధికారి అశోక్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 8 సంవత్సరాలుగా వీఆర్‌ఏలకు వేతనాలు పెంచలేదన్నారు. చట్టవిరుద్ధంగా నైట్ డ్యూటీలు వేస్తున్నారన్నారు.

కోలాట ప్రదర్శనకు చీరల పంపిణీ

కడప నాగరాజుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామరాజుపల్లె యూత్ దళిత హక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో నవంబరు 15న జరిగే కోలాట ప్రదర్శనకు చీరలను మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బంగారు నాగయ్యయాదవ్ అందజేశారు. శనివారం రామరాజుపల్లెలో రామాలయం వద్ద వీటిని పంపిణీ చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కడప నాగరాజుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని షేక్‌చాంద్‌బాషా, లయన్ పఠాన్ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సొసైటీలో నిండు గర్భవతి ప్రాణాపాయ స్థితిలో ఉండగా రక్తం అవసరమై తమను కోరగా వెంటనే రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో సీపీఓగా పనిచేస్తున్న షేక్ అబ్దుల్‌రషీద్‌ను కలిసి విన్నవించామన్నారు. ఆయన వెంటనే రక్తదానం చేశారన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

కమలాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం వల్లూరు, కమలాపురం, ఎర్రగుంట్ల మండలాల్లోని రైతు సేవాకేంద్రాల ఇన్‌చార్జ్‌లకు రబీ సీజన్ పంటలపై శిక్షణ ఇచ్చారు. శనగ, మినుము పంటలకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యలను వివరించారు.

అవినీతి నిర్మూలనే లక్ష్యం కావాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అవినీతిరహిత భారతదేశం అందరి లక్ష్యం కావాలని ఎస్‌ఎస్‌ఎస్ పీఠ ప్రొఫెసరు కె.శ్రీనివాసరావు తెలిపారు. అవినీతి రహిత వారోత్సవాల్లో భాగంగా శనివారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అవినీతి వల్ల ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని, దాన్ని నిర్మూలించేందుకు అవగాహన కలిగి ఉండాలన్నారు. అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ క్రిష్ణయ్య, పీఎస్‌టి అకడమిక్ కన్సల్టెంట్లు శశికుమార్, నారాయణరెడ్డి మాట్లాడారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రాముడు, రెండో బహుమతి జాన్ మోషే, మూడో బహుమతి హారిక గెలుచుకున్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంటుకు ఏర్పాట్లు చేయండి: కమిషనర్

కడప ఎడ్యుకేషన్ నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):ఆర్మీ రిక్రూట్‌మెంటుకు సంబంధించి త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం కడప నగరం మున్సిపల్ స్టేడియంలో ఆయన ఇంజనీరింగ్ అధికారులు, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ అధికారులతో పరిశీలించారు. అసిస్టెంటు సిటీ ప్లానర్ మునిరత్నం, ఎంహెచ్‌వో చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టరు నాగసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


సీఎం సహాయనిధి అందుకున్న వారితో రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తున్నట్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన నివాసం వద్ద అనారోగ్యంతో ఇబ్బంది పడిన వారి కుటుంబాలకు దాదాపు 28 మందికి రూ.29 లక్షల సీఎం సహాయ నిధి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి అందించేలా కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రజల అర్జీలను స్వీకరించారు. ప్రజలు సమస్యను చెప్పిన వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

కడప రూరల్ నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక చట్టాలపై అవగాహనను పెంపొందించుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవా సదన్‌లో శనివారం ప్యానల్ న్యాయవాదులకు, పారాలీగల్ వాలంటీర్లకు ప్రత్యేక చట్టపరమైన అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ఈ సందర్భంగా జడ్జి లీగల్ ఎయిడ్ కేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, లీగల్ సిస్టమ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, ఎల్‌జీబీటీక్యూఐఏ కమ్యూనిటీ మెంబర్స్, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 తదితర అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి: ఏఐటీయూసీ


వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ సభ్యులు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కడప లేబర్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ సుప్రియకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ మాట్లాడారు. 2020 నుంచి అన్ని కార్మిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల 73 రకాల షెడ్యూళ్లలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు కనీస వేతనం అందక వేలాది రూపాయలు నష్టపోతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులకు వేలాది క్లెయిమ్స్ పరిష్కారం కాకుండా లక్షలాది రూపాయలు నష్టపోతున్నారన్నారు. అనేక మంది కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ అందక జీవితానికి భద్రత లేకుండా పోయిందన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దిమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై కెరీర్ కౌన్సెలింగ్

కడప నాగరాజుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కమిషనర్ యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు కడప నగరంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సాయిగ్రేస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెరీర్ కౌన్సెలింగ్ అనేది సరైన మార్గాన్ని కనుగొనడంలో సహాయపడుతుందన్నారు. విద్యార్థులు ఏ కోర్సులో చేరాలనే దానిపై స్పష్టత కోసం ఈ ప్రక్రియ దోహదపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి, కళాశాల విద్యార్థులు, స్టెప్ మేనేజరు సుబ్బరాయుడు, సిబ్బంది అబ్బాస్‌వలి, నాగయ్య నారాయణ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు: సీఐ

కమలాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని సీఐ రోషన్, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎస్పీ విష్ణువర్ధనరాజు, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు బహిరంగ మద్యపాన నిరోధానికి పోలీసులు చర్యలు తీసుకున్నారు. కమలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో బహిరంగ మద్యపానం సేవించే ప్రాంతాలను శుభ్రపరిచి క్రీడలకు అనువుగా తీర్చిదిద్దామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తమ సిబ్బంది సహకారంతో పోలీసుస్టేషన్ పరిధిలో కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించినట్లు తెలిపారు. బహిరంగ మద్యపానం చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రదేశాలను శుభ్రపరిచినట్లు తెలిపారు.

కుడికాల్వ పరిధిలోని చెరువులన్నీ నింపుతాం: బీటెక్ రవి

లింగాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): లింగాల కుడికాల్వ పరిధిలోని చెరువులన్నీ నింపుతామని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. లింగాల పాత చెరువుకు పెంచికల బసిరెడ్డి రిజర్వాయర్ (సీబీఆర్) కుడికాల్వ నుంచి ఎత్తిపోతల ద్వారా శనివారం ఆయన నీటిని విడుదల చేశారు. వేసవిలో తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు లేకుండా అన్ని చెరువులకు నీటిని విడుదల చేస్తామన్నారు. అనంరం దీపం-2 పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. గ్యాస్ కు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు జోగిరెడ్డి, సంజీవరెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.


మోటార్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న బీటెక్ రవి

గుంతలు లేని రోడ్లుగా చేయడమే ధ్యేయం

సింహాద్రిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) గుంతలు లేని రోడ్లుగా చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ ముందడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని నిడివెలగల-హిమకుంట్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్యాచ్ పనులకు బీటెక్ రవి భూమిపూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంబిచారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వంలో రోడ్ల మరమ్మతులు చేసినట్లు ఆనవాళ్లు కూడా లేవన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ మండల ఇంచార్జ్ జోగిరెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి న్యాయం చేయకుంటే నిరాహార దీక్ష

కడప మారుతీనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మండలం కొండపేట గ్రామ దివ్యాంగుడు బచ్చు సురేశ్‌బాబుకు న్యాయం చేయాలని, లేకుంటే ఈనెల 6న చెన్నూరు పోలీసుస్టేషన్ వద్ద నిరాహారదీక్ష చేపడతామని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నసుబ్బయ్య, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాతయ్యబాబు హెచ్చరించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రోడ్డు ప్రమాదానికి గురైన సురేశ్‌బాబు వైద్య ఖర్చుల కోసం శివరామిరెడ్డి అనే వ్యక్తికి రూ.5.50 లక్షలకు అమ్మకానికి బేరం పెట్టారన్నారు. రూ.4.50 లక్ష ముందుగా ఇచ్చి మిగతా రూ.లక్ష తరువాత ఇస్తానని చెప్పారన్నారు. మిగతా డబ్బు ఇవ్వాలని కోరగా ఆ ఇల్లు మాకు అవసరం లేదు, మా డబ్బు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారన్నారు. దీంతో పెద్దమనుషుల సమక్షంలో ఆ డబ్బు తిరిగి చెల్లించినా దివ్యాంగుడిని దుర్భాషలాడడం దారుణమన్నారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అతనిపై ఇంతవరకు చట్టపరంగా చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణమే న్యాయం చేయాలని కోరారు.

అపార్ సమస్యలను పరిష్కరించండి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అపార్‌లో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ మీనాక్షిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అపార్ ఐడీ నమోదులో ప్రధానోపాధ్యాయుల మీద ఒత్తిడి లేకుండా చేయలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు, కార్యదర్శులు సురేంద్ర పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించాలి

కడప రూరల్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీ సమస్యల పరిష్కారానికి తగు చర్యలను చేపట్టాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన కొత్తకలెక్టరేట్‌లోని డీపీఓ కార్యాలయంలో పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజ్యలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. కొత్తపల్లె పంచాయతీ పరిధిలో నివాసేతర భవనాలు నిర్మించుకున్న భవన యజమానుల నుంచి అనుమతుల కోసం కడప పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) రూ.16917285 వసూలు చేశారన్నారు. ఈ మొత్తంలో గ్రామ పంచాయతీకి రావాల్సిన నిధులు చెల్లించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

కడప కలెక్టరేట్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి సమక్షంలో పలు మండలాలకు చెందిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు, కామసముద్రానికి చెందిన టి.సుబ్బారెడ్డి, చెర్లో రామాపురం నుంచి నరసింహయాదవ్ తన అనుచరులు పార్టీలో చేరారన్నారు.

పుస్తకానికి గౌరవం ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పుస్తకం ఏ భాషలో ఉన్నా గౌరవం, విలువ ఇవ్వాలని ప్రముఖ ఉర్దూ కవి, పరిశోధకుడు ప్రొఫెసరు డాక్టర్ రహీంపిదాయి తెలిపారు. శనివారం వైవీయూ ఉర్దూశాఖ ఆధ్వర్యంలో నీట్ ద అసర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు మాధ్యమంలో పాఠశాల విద్య పూర్తి చేసి తరువాత ఉర్దూలో పుస్తక రచన చేశానన్నారు. అన్ని భాషలు సమానమేనని, ఇష్టపడి నేర్చుకోవాలని సూచించారు. జ్ఞానం సముపార్జించేలా చదువులు సాగాలన్నారు.



ఈ రోడ్డుపై ప్రయాణం చాలా కష్టం.. ఎందుకంటే రోడ్డు పొడవునా గుంతలే.. నట్టి నడిరోడ్డుపై కూడా పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. బ్రిడ్జీపై కడ్డీలు కూడా బయటపడ్డాయి. వాహనదారులు ఏమాత్రం ఏమారినా అంతే సంగతులు.. ఇదెక్కడో కాదు... కడప- ఊటుకూరు సర్కిల్ నుంచి పులివెందుల సర్కిల్ వరకు ఈ దుస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి మరి... - చింతకొమ్మదిన్నె, (ఆంధ్రజ్యోతి)

సోషల్ మీడియా పట్ల జాగ్రత్త అవసరం

● ఎస్‌ఐ శాంతమ్మ


గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులతో ఎస్‌ఐ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు యూట్యూబ్, సోషల్ మీడియాపట్ల జాగ్రత్తగా ఉండాలని మహిళా పోలీసుస్టేషన్ ఎస్‌ఐ శాంతమ్మ సూచించారు. శనివారం కడప నగరం గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలులో అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు చెప్పే విధంగా నడుచుకోవాలన్నారు. అలాగే సోషల్ మీడియాలో విద్యార్థులకు తెలియకుండానే అనేక అరాచకాలు, చూడరాని దృశ్యాలు వస్తున్నాయని వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాటి వైపు చూడకూడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పకుమారి, ఉపాధ్యాయులు రూతు ఆరోగ్యమేరీ, సరిత, స్వరాజ్‌లక్ష్మి, శశిరేఖ, చంద్రకళ, జ్యోతి పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణమే ప్రభుత్వ ధ్యేయం


రోడ్డు పనులను ప్రారంభిస్తు దృశ్యం


సీకేదిన్నె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):సురక్షిత ప్రయాణమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం మూలవంక, వెల్లటూరు రోడ్డులో రూ.15 లక్షలతో రోడ్డు మరమ్మతు పనులు శనివారం ఆయన ప్రా రంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంతలు లేని రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన నిధులను కూడా విడుదల చేసిందన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.వి.క్రిష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, బాలిరెడ్డి, మహేష్, శంకర్‌రెడ్డి, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయండి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న రూటా ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని రూటా వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదయతుల్లా, అసోసియేట్ అధ్యక్షుడు సత్తార్ ఫైజీ కో రారు. శనివారం మైనార్టీ మంత్రి ఫరూక్‌కు వారు వినతిపత్రం అం దించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా దాదాపు ఉర్దూ మీడియం సబ్జెక్టుల ఉపాధ్యాయ పోస్టులన్నీ బ్యాక్‌లాగ్‌లో చూపుతున్నారని, దీంతో ఉర్దూ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి ఫరూక్ స్పందిస్తూ ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పో స్టులు భర్తీ చేస్తామని తెలిపారన్నారు. టీడీపీ నాయకులు అమీర్‌బాబు, నజీర్‌అహ్మద్, సలావుద్దీన్, ఉర్దూ డీఐ అఫ్రుద్దీన్, రూటా రాష్ట్ర కోఆర్డినేటరు మ హ్మద్ ఆయుబ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సలీంతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


సీఎం చంద్రబాబును సన్మానిస్తున్న నాయకులు

కడప మారుతీనగర్, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగ పెన్షన్‌దారుల అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పింఛనుదారుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు జి.పూర్ణచంద్రరావు, కన్వీనరు గురవయ్య, ఎన్జీఓ సంఘం మాజీ జిల్లా కార్యదర్శి ఓబులేసు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు గత ప్రభుత్వంలో కోల్పోయిన రాయితీలను పునరుద్ధరించాలన్నారు. అలాగే కమ్యూనికేషన్ కాలాన్ని 15 నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. ఈహెచ్‌ఎస్ కార్డులపై నగదు రహిత పూర్తి వైద్యసేవలు అందించాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులపై ఉద్యమకాలంలో నమోదైన కేసులన్నీ ఎత్తివేయాలన్నారు. 11వ పీఆర్సీని సవరించి 12వ పీఆర్సీని నియమించి ఆ మేరకు పెండింగు డీఏలు, బకాయిలు చెల్లించాలన్నారు. చంద్రబాబును కలిసిన వారిలో పింఛనుదారుల సంఘం కో ఆర్డినేటరు విజ్డం చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం ఎంతో ప్రయోజనం

వల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో సభ్యత్వం ఉండటం ఎంతో ప్రయోజనమని కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు మనోహర్‌నాయుడు అన్నారు. శనివారం మండలకేంద్రంలో టీడీపీ నాయకులతో సమాశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం ఎలా నమోదు చేయాలో తర్ఫీదునిచ్చామన్నారు. ప్రతి ఇంటిలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపడతామని తెలిపారు. వల్లూరు టీడీపీ నాయలకులే కాకుండా ఐటీడీపీ విభాగ సభ్యులు కూడా పాల్గొని కార్యకర్తలకు సలహాలు, సూచనలు అందించారు.

శిక్షణతో అభివృద్ధి చెందాలి

చెన్నూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువత తమకు ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ పొంది అభివృద్ధిలో రాణించాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు సూచించారు.శనివారం 9 గ్రామ సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయ సిబ్బంది కచ్చితంగా నైపుణ్య గణన తప్పక చేపట్టాలన్నారు.

మట్కా, పేకాట ఆడితే కేసులు నమోదు చేస్తాం


సురేష్‌రెడ్డి, సీఐ, వేంపల్లె

పటాపట్

వేంపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండల పరిధిలో ఎక్కడైనా మట్కా, పేకాట జూదాలు ఆడుతున్నట్లయితే దాడులుచేసి కేసులు నమోదు చేస్తామని సీఐ సురేష్‌రెడ్డి హెచ్చరించారు. ఆంధ్రజ్యోతితో పటాపట్ ఇంటర్వ్యూలో సీఐ తెలిపిన వివరాలు ఇవీ...

ప్రశ్న: వేంపల్లెలో మట్కా, పేకాట జూదం విచ్చలవిడిగా జరుగుతోంది, దీన్ని ఎలా నియంత్రిస్తారు?

జవాబు: ఎక్కడ మట్కా జరుగుతున్నా, పేకాట జూదమాడుతున్నా సమాచారం తెలిసిన వెంటనే దాడులు చేస్తున్నాం. మూడు నెలల కాలంలో మట్కాపై ఐదు కేసులు నమోదుచేశాం. పేకాట జూదంపై పది కేసులకు పైగా నమోదు చేశాం. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు సమాచారం ఇస్తే కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: వేంపల్లె ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రధానంగా గండి రోడ్డు, కడప రోడ్డు, నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించాం. ఎస్‌ఐలను తనిఖీకి పంపి జరిమానా విధిస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా పోలీసులను ఉంచి ట్రాఫిక్‌ను క్ర మబద్ధీకరిస్తున్నాం. ప్రస్తుతం రోడ్లపై ఉ న్న దుకాణాలు, తోపుడు బండ్లను ఒక ప క్కకుజరిపించే చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తాం.

ప్రశ్న: శాంతిభద్రతలను ఎలా అదుపుచేస్తున్నారు, ఫ్యాక్షన్ గ్రామాల పరిస్థితి ఏమిటి?

జవాబు: వేంపల్లె పట్టణంతో పాటు గ్రామాల్లో తరచూ పర్యటించి పరిస్థితిని ఆరాతీస్తున్నాం. ముఖ్యంగా ఫ్యాక్షన్ గ్రామాలైన అలవలపాడు, రామిరెడ్డిపల్లె, ముతుకూరు, టి.వెలమవారిపల్లె గ్రామాలను ఎస్‌ఐలతో పాటు నేను తనిఖీ చేసి ప్రజలు శాంతియుతంగా జీవనం సాగించాలని కోరుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నాం. ప్రత్యేకంగా బహిరంగ ప్రదేశాల్లో మదుతాగే వారిపై కఠినంగా వ్యవహరించి ఎలాంటి గొడవలు జరగకుండా ప్రయత్నిస్తున్నాం.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పెండ్లిమర్రి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పొలతల క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసోత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. మల్లేశ్వరస్వామి, అక్కదేవతలు, బండెన్న కరుణ కటాక్షం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కృష్ణానాయక్, టీడీపీ నాయకులు రాజారెడ్డి, టీడీపీ మండల ఇన్‌చార్జి గంగిరెడ్డి, అన్నమయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో రిటైర్డ్ ఉద్యోగుల సూచనలు కీలకం

కడప ఎడ్యుకేషన్ నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల సూచనలు కీలకమని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి తెలిపారు. శనివారం పెన్షనర్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో ప్రజాప్రతినిధులతో పాటు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కూడా కీలకమని వారి సలహాలు ప్రభుత్వానికి చుక్కానిలా పనిచేస్తాయన్నారు.

సేవాశ్రమానికి లక్ష రూపాయల వితరణ



కాశినాయన నవంబరు (ఆంధ్రజ్యోతి)2: ఓబుళాపురం సమీపంలోని నగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమానికి గొంటువారిపల్లె గ్రామానికి చెంది న మాజీ సర్పంచ్ బోయిళ్ళ రమణారెడ్డి రూ.1,00,000లు విరాళంగా అందజేశారు. ఆమేరకు శనివారం సంస్థ వ్యవస్థాపకుడు రామక్రిష్ణారెడ్డికి లక్ష నగదును అందించారు. సంస్థ సభ్యుడు పాణ్యం చిన్నహుస్సేన్ పాల్గొన్నారు.

అవినీతి అంతానికి ప్రతిజ్ఞ

ఎర్రగుంట్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): లంచం ఇవ్వం-తీసుకోబోమని ఆర్టీపీపీలో ఉద్యోగులు శనివారం ప్రతిజ్ఞ చేశారు. ఏపీ జెన్కో విజిలెన్స్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో శనివారం విజిలెన్స్ వీక్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈ గౌరీపతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈసంవత్సరం కూడా అక్టోబరు 28 నుంచి నవంబరు 3వ తేదీ వరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆర్టీపీపీలో కూడా ఈకార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జీఎం ఫైనాన్స్ బాలాజీ, జెన్కో విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ రమేష్‌కుమార్, పర్యవేక్షణాధికారులు సోమశేఖర్‌రెడ్డి, పద్మావతి, మీరా, ఈఈ ఎఫ్‌ఎం సిద్దయ్య, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి సహకారం అందించాలి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని యాదవ సమాజ అన్నదాన సంఘం అభివృద్ధికి ప్రతి సభ్యుడు సహాయ సహకారాలు అందించాలని సంఘం అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శి లక్కినేని బాలరాజు యాదవ్, కోశాధికారి పెద్దన్నయాదవ్ తెలిపారు. శనివారం నూతన సంవత్సర జనవరిలో క్యాలెండరు ఆవిష్కరించేందుకు సభ్యుల చందాల కోసం సమావేశం నిర్వహించారు. సంఘం అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన అనంతపురం జిల్లా, పెద్దకొప్పలమండలం రెడ్డిపల్లెగ్రామానికి గంగన్నయాదవ్‌ను కమిటీసభ్యులు ఘనంగా శాలువా, పూలమాలతో సన్మానించారు. క్యార్యక్రమంలో కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల 2వ ఎంఈవోగా రామాంజనేయరెడ్డి

ఎర్రగుంట్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలం రెండో ఎంఈవోగా (ఎఫ్ఏసీ) రామాంజనేయరెడ్డి నినియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. బాలుర ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్న ఈయనుకు ఎంఈవో-2గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఈవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం



రోడ్ల గుంతల మరమ్మతులను పరిశీలిస్తున్న రితేష్‌కుమార్‌రెడ్డి, బొజ్జా రోశన్న

బద్వేలుటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేత బొజ్జా రోశన్న అన్నారు. ఈ సందర్భంగా వారు శనివారం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాలశాఖ ఆధ్వర్యంలో ఏపీలోని గుంతల మరమ్మతుల కోసం కూటమి ప్రభుత్వం అన్ని రోడ్లలో ఎక్కడా కూడా గుంతలు కనపడకూడదని ముఖ్యమంత్రి ఈ బృహత్తర కార్యకమానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. బద్వేలు నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతుల పనులు సుమారు రూ.60లక్షలతో మొదటివిడతగా ప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. సిద్దవటం రోడ్డులోని విద్యా నగర్, వెంకటశెట్టిపల్లె తదితర రహదారులలో మరమ్మతులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ సలీం, ఆర్‌అండ్ బీ అసిస్టెంటు ఇంజనీర్లు, టీడీపీ నాయకులు వెంగళరెడ్డి, రవి కుమార్‌రెడ్డి, బిగ్‌బాస్, పార్థసారథి, రామచంద్రారెడ్డి, రమణ, మల్లేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జొన్నపంటలో కత్తెర పురుగు

రాజుపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలకు క్రిమి కీటకాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంట ఏపుగా ఉన్న తరుణంలో జొన్న పంటకు కత్తెర పురుగు ఆశించడం తో రైతన్నల్లో అయోమయ పరిస్థితి ఏర్పడుతుంది. రబీ పంటలైన జొన్న పంట సెప్టెంబరు రెండో వారంలో పంట సాగు చేశారు. సాగైన జొన్న పంట పై కత్తెర పురుగు ఉధృతి ఏర్పడింది. ఈ పంటను కత్తెర పురుగు ఆశించడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఈ పురుగు ఉధృతికి ఖరీదైన మందులు పిచికారీ చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. మొక్కలో సుడులపై ఈ కత్తెర పురుగు దాడి చేస్తున్నా ఏపుగా ఉన్న పంట దిగపెరగడంతో పాటు మందులు పిచికారీ చేసినా పురుగు చావడంలేదని అన్నారు. రెండేళ్లుగా రైతన్నలకు ఈ పురుగు ఉధృతి ఆశిస్తూనే ఉంది. మండలంలోని టంగుటూరు, గాదె గూడూరు, అయ్యవారుపల్లె, తొండలదిన్నె ప్రాంతాల్లో దాదాపు 500 ఎకరాల పైబడి ఈ పంట సాగులో ఉంది. చాపాడు కెనాల్‌కు నీరు రావడంతో పాటు వర్షాధారంతో తక్కువ ఖర్చులతో ఈ పంట రైతుకు దిగుబడి అందిస్తుందని ఆశపడ్డ రైతన్నలకు ఈ పురుగు నిరాశను కల్గిస్తోంది. అధిక మందులు మోతాదుతో పిచికారీ చేయడం వల్ల పంట కూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు పేర్కొన్నారు. ఈ కత్తెర పురుగు ఉధృతి తగ్గించేందుకు రైతులకు సరైన సలహాలు, సూచనలు ఇవ్వాలని పలువురు గ్రామాల రైతులు తెలిపారు. పంటపై ఈ పురుగు ఉధృతి ఇలాగే సాగితే పంట దిగుబడి తగ్గడంతో పాటు నష్టం చేకూరుస్తుందని పేర్కొన్నారు.





పురుగు ఆశించిన మొక్క

రైతులకు సూచనలు ఇస్తాం

పంటపై పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు చెప్పడం జరగిందన్నారు. కత్తెర పురుగు నివారణకు లార్విన్ అనే మందును లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున పిచికారీ చేయడంతో పాటు పంటలో ఎక్కువ మోతాదులో నీటి ట్యాంకులో అందించాలని తెలిపారు. అవసరమైతే డ్రోన్ ద్వారా ట్రాక్టరు పంపు సెట్ ద్వారా పంటల పిచికారీ చేయడం ద్వారా మందు ఎక్కువగా పడుతుందని వీటి ద్వారా పిచికారీ చేయడంతో సుడిలో ఉన్న పురుగును చంపేందుకు వీలవుతుందని రైతులకు సూచించాం.

శివరామక్రిష్ణారెడ్డి, ఏవో

సర్వే పకడ్బందీగా చేయాలి

దువ్వూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని ఎంపీడీవో సభాభవనంలో శనివారం నైపుణ్య గణనపై మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి వివిధ వృత్తుల్లో నైపుణ్యం ఉన్నా కూడా నిరుద్యోగులుగా ఉన్న వారిని గుర్తించాలని ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. ప్రతి గ్రామంలో కనీసం 10 మంది నైపుణ్యంగలవారిని గుర్తించి వారి భవితకు సహకరించాలని, ఇందుకు ప్రభుత్వ తోడ్పాటు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నైపుణ్య గణన జిల్లా కో-ఆర్డినేటర్ రఘునాథ్ పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఖాజీపేట..: గ్రామాల్లో సర్వే చేసేటప్పుడు పకడ్బందీగా చేయాలని ఎంపీడీవో దివిజసంపతి అన్నారు. శనివారం ఖాజీపేటలోని షాదీఖానాలో నైపుణ్యగణన కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో రమణ, ఏపీవీఎస్



దువ్వూరు... మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణయ్య

డీసీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: ఏపీ స్కిల్ సెన్సస్ సర్వే 2024పై సచివాలయ సిబ్బందికి శనివారం కమిషనర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషఫణి మాట్లాడుతూ పట్టణంలోని 15 నుంచి 59సంవత్సరాల వయసుగల విద్యార్హతలు, వారి నైపుణ్యం గుర్తించేందుకు వార్డు సచివాలయసిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఈ సర్వేపై సిబ్బందికి సమగ్రశిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో యువత విద్యార్హతలు గుర్తించి ఉపాధి, ఉద్యోగాలు కల్పించేందుకు అవసరమైన మార్గదర్శకాలను కల్పిస్తారన్నారు.

కలసపాడు..: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నైపుణ్య గణన సర్వేపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో మహబూబ్‌బీ తెలిపారు. శనివారం మండలంలోని అన్ని సచివాలయాల పంచాయతీ సెక్రటరీ, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్కిల్‌డెవలప్‌మెంటులో భాగంగా ఎనిమిది రకాల అంశాలపై ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి సమగ్ర నివేదికను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ మురళీ మోహన్, పంచాయతీ సెక్రటరీలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జైలుశిక్ష

పోరుమామిళ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆటో నడిపినందుకు అన్నం సయ్యద్‌బాబుకు కోర్టు ఏడు రోజులు సాధారణ జైలుశిక్ష విధించిందని పోలీసు అధికారులు తెలిపారు. పోరుమామిళ్లకు చెందిన సయ్యద్ బాబు గత నెల 28న మద్యం తాగి ఆటో నడిపినందుకు కేసు నమోదు చేసి శనివారం కోర్టుకుహాజరు పరచగా అతనికి ఏడురోజులు సాధారణ జైలు విధించారని పోలీసులు తెలిపారు.

గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించాలి

కడప రూరల్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీ సమస్యల పరిష్కారానికి తగు చర్యలను చేపట్టాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన కొత్తకలెక్టరేట్‌లోని డీపీఓ కార్యాలయంలో పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజ్యలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. కొత్తపల్లె పంచాయతీ పరిధిలో నివాసేతర భవనాలు నిర్మించుకున్న భవన యజమానుల నుంచి అనుమతుల కోసం కడప పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) రూ.16917285 వసూలు చేశారన్నారు. ఈ మొత్తంలో గ్రామ పంచాయతీకి రావాల్సిన నిధులు చెల్లించాలని కోరారు.

లక్కీడ్రా విజేతలు

పోరుమామిళ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని అమోఘ హోండా షోరూంలోదసరా, దీపావళి సందర్భంగా శనివారం లక్కీడ్రా తీశారు. లక్కీడ్రాలో గెలుపొందిన వారికి షోరూం యజమాని కాశినాయన మండల టీడీపీ నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందించారు. నరసాపురం చెందిన యోగాలక్ష్మికి మొదటి బహుమతి, కవలకుంట్లకు చెందినకె.ప్రభావతికి రెండో బహుమతి, చింతలపల్లెకు చెందిన శైలజకు మూడో బహుమతి అందించారు. కార్యక్రమంలో షోరూం మేనేజరు సద్దాంవలి,సిబ్బంది పాల్గొన్నారు.



లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందిస్తున్న రవీంద్రారెడ్డి

'సంబంధంలేని దళితులపై అక్రమ కేసులు పెట్టడం దారుణం'

బద్వేలుటౌన్, నవంబరు 2 : బి.కోడూరు మండలం తంగెడుపల్లె భూవివాదంలో సంబంధంలేని అమాయకులైన దళితులపై కేసులుపెట్టి అరెస్ట్ చేయడం దారుణమని బీజేపీ బొజ్జ రోశన్న పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తంగెడుపల్లె భూవివాదంలో సంబంధంలేని వ్యక్తులను పోలీసులు అరెస్టచేయడం దారుణమని, దీనిపై తాలూకా దళితసంఘాలు ఖండిస్తున్నాయన్నారు. వైసీపీ నాయకులు భూ ఆక్రమణలుచేసి, అమాయకులపైమోపి వారిపైనే కేసులు పెట్టడం దారుణమన్నారు. దళితులకు ఇచ్చిన ఇంటిపట్టాలను వైసీపీ నాయకులు ఆక్రమించుకోవడం అన్యాయంకాదా, చిత్తశుద్ధి ఉంటే భూములపై బహిరంగచర్చకు రావాలని ఆయన అన్నారు.

అధికారులు సహకరించినప్పుడే గ్రామీణాభివృద్ధి

గోపవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):అభివృద్ధి టీడీపీ ప్రధాన లక్ష్యమని మండల అధ్యక్షురాలు ధనలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సభా భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా శాఖ అధికారులు సహకరించినప్పుడే గ్రామీణాభివృద్ధి జరుగుతుందన్నారు.టీడీపీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామనాథరెడ్డి , తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ షేక్ హసీనా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు బహిష్కరణ

పెద్దముడియం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తెచ్చిన రీసర్వే కారణంగా రైతులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. 1బీలు రాక, విస్తీర్ణంలో వ్యత్యాసాలు తదితర సమస్యలతో రైతులు ఇన్నాళ్లు నానా పాట్లు పడ్డారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ రైతుల నుంచి వినతులు స్వీకరిస్తోంది. ఈ క్రమంలో మండలంలోని చిదిపిరాళ్ల గ్రామంలో శుక్రవారం తహసీల్దారు బాల నరసింహులు ఆధ్వర్యంలో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఎప్పుడో తమ పెద్దలుకొన్న భూములు ఇప్పుడు ఈనాం, మాన్యం భూములంటూ చూపడం దారుణమని రైతులు మండిపడ్డారు. ఇంకా చాలా సమస్యలు ఉన్నాయని రెవెన్యూ సదస్సులను నిర్వహించవద్దని రైతులు తహసీల్దారు బాలనరసింహులుకు బహిష్కరణ వినతిపత్రం అందించారు.

బాలప్పకోనకు దారి మళ్లింపు

కొండాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం బాలప్పకోనకు ప్రస్తుతం దారి మళ్లించినట్లు ఆలయ నిర్వాహకుడు మిట్టా బాలభాస్కరరెడ్డి తెలిపారు.ప్రస్తుతం గండికోట బ్యాక్ వాటర్ పూర్తిగా ఉన్నందున బొందలదిన్నె దారి పూర్తిగా మునిగిపోయిందన్నారు. దీంతో వంగనూరు నుంచి కోడూరు, కొత్తపల్లె మీదుగా కోనకు చేరుకోవచ్చన్నారు. కార్తీకమాసంలో కోనకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. శనివారం కార్తీక మాసం ప్రారంభమైనందున కోనలో అఖండ దీపారాధన వెలిగించామన్నారు. అదే విధంగా ప్రతి కార్తీక సోమవారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

పశుపోషణ లాభదాయకం

ఏడీ చంద్రశేఖర్

కాశినాయన నవంబరు (ఆంధ్రజ్యోతి)2: రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ ను పెపొందించుకుంటే ఎంతో లాభదాయ కంగా ఉంటుందని పోరుమామిళ్ల పశు వైద్య సహాయ సంచాలకుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు.అక్కంపేట గ్రామంలో శనివారం పాడిపశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పశువైద్యులు శివశ్రీనివాసులరెడ్డి, రామారావు వైద్యసిబ్బంది నిరోష తదితరులు పాల్గొన్నారు.

5న వెల్లాలలో బహిరంగవేలం

రాజుపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెల్లాల దేవస్థానంలో భక్తులు అందించిన వస్తువులు, తలనీలాలు తదితర వాటికి 5న మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో నరసయ్య తెలిపారు. సంజీవరాయస్వామి కల్యాణ మండపం మూడేళ్లపాటు అద్దెకు ఇచ్చేందుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.50వేలు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. భక్తులు సమర్పించిన తలనీలాలు, బియ్యం, బెల్లం, పెసరబేడలు నూనె, ఆముదం, తదితర వాటిని కూడా వేలం పాట నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనే వారు రూ.వెయ్యి చెల్లించి పాటదారుడు పాల్గొనాలని తెలిపారు.

పోలీసు 30 యాక్టు అమలు

జమ్మలమడుగు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో నవంబరు 1వ తేదీ నుంచి 30 వరకు సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉందని, ఇన్‌చార్జి డీఎస్పీ రమాకాంత్, అర్బన్ సీఐ లింగప్ప ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం రాత్రి జమ్మలమడుగు పట్టణంలోని అన్ని వీధుల్లో పోలీసు యాక్టు అమలులో ఉందని, కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు 30 యాక్టు అమలులో ఉన్నందున ఊరేగింపులు, ధర్నాలు, సభలు నిర్వహించుటకు తప్పనిసరిగా పోలీసువారి నుంచి ముందస్తు అనుమతి పొందాలని తెలిపారు.

ఆటో బోల్తా:నలుగురికి గాయాలు

ముద్దనూరు నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండల పరిధి బొందలకుంట గ్రామ సమీపంలోని మలుపు వద్ద శనివారం ఆటో బోల్తా పడటంతో డ్రైవర్ శ్రీనివాసులు కాలికి తీవ్రగాయం కాగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి.స్థానికుల సమాచారం మేరకు వివరాలు..చింతకుంట గ్రామానికి చెందిన వారు బొందలకుంట గ్రామంలో ఎరువుల లోడు దించేందుకు ఆటోలో వెళ్లారు. తిరిగి వస్తుండగా మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్ కాలికి తీవ్ర గాయం అయ్యింది. గాయపడిన వారిని 108 లో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పశుగణన వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

జమ్మలమడుగు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో శనివారం ఉదయం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పశుసంవర్థకశాఖ అధికారులు పశుగణన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశువుల డాక్టర్ దస్తగిరమ్మ, బీజేపీ కన్వీనర్ చౌడం జొల్లు కొండయ్య, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, మేకల జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పరుగులు తీయాలి

జమ్మలమడుగు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలో అభివృద్ధి పరుగు తీయాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామం వద్ద గొరిగెనూరు గ్రామానికి రోడ్డుపనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాకు రూ.16 కోట్లు మంజూరైతే జమ్మలమడుగుకే రూ.10 కోట్లు కేటాయించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, కూటమి నేత గోనా పురుషోత్తంరెడ్డి, కన్నెలూరు కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, మునిసుబ్బారెడ్డి, సర్పంచులు గువ్వల రామాంజనేయరెడ్డి, గురుశేఖర్‌రెడ్డి, వంగల నాగేంద్రయాదవ్, పోలీసు చంద్ర, నవనీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్..: ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ప్రధాన రహదారిలో మరమ్మతు పనులకు టీడీపీ నేతలు శ్రీకారం చుట్టారు.

రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభం



జమ్మలమడుగు.. రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

గుంతల రహిత రహదారుల కార్యక్రమంలో భాగంగా శనివారం మరమ్మతు పనులను మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి ప్రారంభించారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్ల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయం విదితమే. దీంతో ప్రొద్దుటూరు-మైదుకూరు ప్రధాన రహదారిలో ఉన్న గుంతల మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

కాశినాయన..: మండలంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నా యని పీఆర్ ఏఈ బాలపుల్లయ్య తెలిపారు. మొదటి విడతలో కోటి 74 లక్షల పనులు మం జూరు కాగా శనివారం పిట్టిగుంట, ఉప్పలూరు తదితర గ్రామాల్లో పనులు మొదలు పెట్టామ ని ఒకటి రెండు రోజుల్లో మిగిలిన గ్రామాల్లో కూడా పనులు ప్రారంభమవుతాయన్నారు.